ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 14 ఆగస్టు 2024



ఎంపీడీవోలు వచ్చేశారు

- 30 మండలాలకు నియామకం
- గుంటూరు జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ

నరసరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 30 మండలాలకు ఎంపీడీవోలను నియమించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రకాశం, కృష్ణాజిల్లాకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎంపీడీవోలను బదిలీ చేసిన విషయం తెలిసిందే. వీరందరిని తిరిగి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండలాలకు నియమించారు. మండలాల వారీగా ఎంపీడీవోల వివరాలు..

పేరు	మండలం	జిల్లా
పీ ఉమాదేవి	అమరావతి	పల్నాడు
ఎన్ వెంకటేశ్వరరావు	నరసరావుపేట	పల్నాడు
పీ శివసుబ్రమణ్యం	అచ్చంపేట	పల్నాడు
షేక్ గౌసీయాబేగం	బొల్లాపల్లి	పల్నాడు
కే సమతావాణి	దుర్గి	పల్నాడు
వై హనుమరెడ్డి	యడ్లపాడు	పల్నాడు
ఆర్‌ఈవీ ఫణికుమార్	గురజాల	పల్నాడు
బీ మహేష్‌బాబు	క్రోసూరు	పల్నాడు
పీ పుట్టారెడ్డి	ముప్పాళ్ల	పల్నాడు
బీ శ్రీనివాసరెడ్డి	నకరికల్లు	పల్నాడు
కే నరసింహారావు	పెదకూరపాడు	పల్నాడు
జీ కాశయ్య	పిడుగురాళ్ల	పల్నాడు
కే మాధ్యూబాబు	రొంపిచర్ల	పల్నాడు
జీ సత్యనారాయణ	సత్తెనపల్లి	పల్నాడు
పీ సీతారామయ్య	శావల్యాపురం	పల్నాడు
ఎం శ్రీదేవి	వెల్దుర్తి	పల్నాడు
ఎం శోభారాణి	దాచేపల్లి	పల్నాడు
వై మహాలక్ష్మి	రెంటచింతల	పల్నాడు
టీ సుగుణమ్మ	చుండూరు	బాపట్ల
షేక్ మహబూబ్‌సుభాని	అమృతలూరు	బాపట్ల
ఐ సత్యనారాయణ	కొల్లూరు	బాపట్ల
జీ చంద్రశేఖరరావు	భట్టిప్రోలు	బాపట్ల
కే నాగలక్ష్మి	నిజాంపట్నం	బాపట్ల
బీ మారుతీశేషమాంబ	పిట్టలవానిపాలెం	బాపట్ల
కే శివపార్వతి	రేపల్లె	బాపట్ల
ఏ దీప్తి	తాడికొండ	గుంటూరు
ఏ శ్రీనివాసరావు	పొన్నూరు	గుంటూరు
బీ బాబురావు	చేబ్రోలు	గుంటూరు
పీజే విలియమ్స్	మంగళగిరి	గుంటూరు
వీ విజయలక్ష్మి	కొల్లిపర	గుంటూరు

హా స్టళ్లలో.. హాహాకారాలు



కాస్మోటిక్ చార్జీలూ కష్టమే..



భోజనం సక్రమంగా అందదు.. తలకు నూనె లేదు.. కప్పుకోవడానికి దుప్పటి లేదు.. లైటు కాలిపోతే మార్చే దిక్కులేదు.. మరుగుదొడ్ల నిర్వహణ లేదు.. ఇదీ ఉమ్మడి గుంటూరు పరిధిలోని హాస్టళ్లలో తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటోన్న విద్యార్థుల పరిస్థితి. ప్రభుత్వం నుంచి భోజన బిల్లులు విడుదల కాక.. వారికి సక్రమంగా ఆహారం అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. అయినా గత వైసీపీ పాలకులు.. ప్రస్తుత కూటమి పాలకులకు పట్టడంలేదు. పిల్లల ఆకలి కేకలు చూడలేక కొందరు సంక్షేమాధికారులైన హాస్టళ్ల నిర్వాహకులు అప్పులు చేసి ఆహార పదార్థాలను అందజేస్తున్నారు. వారు కూడా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుపోయింది. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలపై నిర్లక్ష్యం చూపింది. దీంతో వసతిగృహాలు సమస్యల వలయంలో చిక్కుకుపోయాయి. ఇక విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్ చార్జీలు, దుప్పట్లు, ఇతర సామగ్రి, చివరకు నోటు పుస్తకాలు వసతిగృహాలు ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా ఇంతవరకు వారికి అందలేదు. సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలతో అల్లాడు తున్న విద్యార్థులకు గత కొన్ని నెలలుగా ఆహారం కూడా సమస్యగా మారింది. ఇక హాస్టళ్ల నిర్వహణకు విడుదల కావాల్సిన కనీస నిధులు విషయంలోనూ ప్రభుత్వం అలక్ష్యం ప్రదర్శిస్తోంది.

- అర్ధాకలితో విద్యార్థుల అవస్థలు
- జనవరి నుంచి విడుదల కాని భోజన బిల్లులు
- వసతి గృహాల బిల్లుల బకాయి రూ.10 కోట్లు పైమాటే
- కాస్మోటిక్ చార్జీలు, దుప్పట్లు, సామగ్రి అంతే సంగతులు
- కూటమి ప్రభుత్వం వచ్చినా ఇంకా సంక్షేమం సంక్షోభమే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుంటోంది. పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. పేద విద్యార్థులపై కనికరం చూపడం లేదన్న విమర్శలు తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మొక్కుబడిగా వసతి గృహాలను నిర్వహిస్తోందన్న విమర్శలున్నాయి. పదో తరగతి లోపు, కళాశాల విద్యార్థులకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పది వేలకుపైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలు ఉన్నాయి. జనవరి నుంచి భోజన బిల్లులు చెల్లించలేదు. రూ.10 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఎస్సీ, బీసీ, ఎస్టీ విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలకూ ప్రభుత్వం గండి కొడుతున్నది. కూరగాయలు, సరుకులు, గ్యాస్, పాలు అప్పు పద్ధతిలో కొనుగోలు చేసి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు సంబంధిత దుకాణదారులకు చెల్లించే వారు. వంద మంది విద్యార్థులు ఉన్న వసతిగృహానికి నెలకు రూ.1.40 లక్షలు భోజన బిల్లుగా చెల్లించాలి. అయితే జనవరి నుంచి ఆయా బిల్లులు విడుదల చేయకపోవడంతో సంక్షేమాధికారులు విద్యార్థుల ఆకలి తీర్చలేకపోతున్నారు. పైగా వారు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. దుకాణాల్లో సరుకులు తేవాలని ప్రయత్నాలు చేస్తున్నా వారికి అప్పు పుట్టడంలేదు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో నిర్వహణ అధికారులు ఆర్థిక వేతలు ఎదుర్కొంటున్నారు. బిల్లుల చెల్లింపుల్లో ఇలానే జాప్యం జరిగితే విద్యార్థులు భోజనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రానున్నది. వసతి గృహాలకు ప్రభుత్వం చెల్లించే సరుకుల ధరలకు మార్కెట్‌లో ఉన్న ధరలకు పొంతన ఉండటంలేదు. దీంతో నిర్దేశించిన భోజన పట్టిక(మెనూ)ను అమలు చేయలేక నిర్వహణ అధికారులు చేతులెత్తేస్తున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.2,200 ఖర్చు అవుతుంటే ప్రభుత్వం రూ.1,400 చెల్లిస్తోంది. కళాశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.1,600 చెల్లిస్తోంది. వీరికి ఉదయం టిఫిన్, రెండు పూటల భోజనం అందించాలి. కళాశాలల విద్యార్థులకు రోజుకు రూ.53.33, స్కూల్ విద్యార్థులకు రోజుకు రూ.46.66కు భోజనం, ఉదయం టిఫిన్ అందించాలి. పప్పులు, కూరగాయలు నూనె, గ్యాస్ అన్ని వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. అయితే ఆ స్థాయిలో ప్రభుత్వం వసతి గృహాలకు బడ్జెట్ పెంచడంలేదు. దీంతో నిర్దేశించిన భోజన పట్టిక(మెనూ)ను అమలు చేయలేక నిర్వహణ అధికారులు చేతులెత్తేస్తున్నారు. మార్కెట్‌లో ధరలను పరిశీలిస్తే ప్రభుత్వం చెల్లించే ధరకు ఆహార పదార్థాలను అందించలేని పరిస్థితి. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని పాలకులు చెబుతున్నా ఆచరణలో ఎక్కడా కనిపించడంలేదు. మెనూ ప్రకారం ఇవ్వాలంటే తమ జీతాలు కూడా సరిపోవని కొందరు నిర్వాహకులు వాపోతున్నారు. ప్రభుత్వం వసతి గృహాలలో భోజనానికి సంబంధించి మార్కెట్ కనుగుణంగా సరుకుల ధరలు పెంచకుండా విద్యార్థుల కడుపు కాల్చుతోంది. అసలే అరకొరగా నిధులు కేటాయించినా వాటిని సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు ఆహార పదార్థాలు సక్రమంగా అందడంలేదు.

బియ్యం కొనుగోలుకు చేయాల్సిందే..

వసతి గృహాలకు డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేసే విధానాన్ని వైసీపీ ప్రభుత్వం ఎత్తి వేసింది. కిలో రూపాయి చొప్పున డీడీ రూపంలో చెల్లిస్తేనే బియ్యాన్ని వసతి గృహాలకు సరఫరా చేస్తారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో డీడీ అందజేసి బియ్యం వసతి గృహాలకు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వసతిగృహాల నిర్వహణ అధికారులు సొంతంగా నగదు చెల్లించి బియ్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గ్యాస్ సిలెండర్ అప్పు లభించే పరిస్థితి లేదు. దీంతో దానిని కూడా నిర్వహకులే కొనుగోలు చేస్తున్నారు. సరుకులు, పాలు, కూరగాయలు అప్పుపై సరఫరా చేసే అవకాశం ఉంది. అయితే నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కొన్ని వసతి గృహాలకు వాటి సరఫరా నిలిచిపోయింది.

కనీస వసతులకూ నిధులు లేవాయే

ఆహారం, కాస్మోటిక్ చార్జీలు, సామగ్రి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఏదో ఒకలా జరిగిపోతుంది. అయితే వసతి గృహాల నిర్వహణకు కూడా కొన్ని నెలలుగా నిధులు విడుదల కావడంలేదు. చివరకు హాస్టల్‌లో కరెంటు బల్బు మాడిపోయినా దానిని మార్చాలన్నా వార్డెన్లు వారి జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి, ఇతర మరమ్మతులకు కూడా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదని వార్డెన్లు వాపోతున్నారు. వైసీపీ పాలనలో వసతి గృహాలపై నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతి గృహాలకు మహర్దశ పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా వసతి గృహాల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తల్లి దండ్రుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.



నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

కాస్మోటిక్ చార్జీలూ కష్టమే..

ప్రభుత్వం వసతి గృహాల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను నెలవారీగా చెల్లించాలి. అయితే జనవరి నుంచి ఆ చార్జీలు ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటి వైపు చూడక తప్పడం లేదు. కాస్మోటిక్ చార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వ తరగతి బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున చెల్లించాలి. బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ చార్జీ అదనంగా విడుదల చేయాలి. అయితే ఇవేవీ ప్రభుత్వం చెల్లించకపోతుండటంతో విద్యార్థులు తల్లిదండ్రులపై ఆధారపడుతున్నారు. ఇది వారికి భారంగా మారుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభంలో వసతి గృహాల్లో చేరే విద్యార్థులకు కొంత సామగ్రిని ప్రభుత్వం పంపిణీ చేయాలి. అయితే వసతి గృహాలు తెరిచి రెండు నెలలు గడిచినా నేటి వరకు నోట్ పుస్తకాలు, దుప్పట్లు, ప్లేట్, గ్లాసు, ట్రంక్ పెట్టె తదితర సామగ్రిని నేటి వరకు విద్యార్థులకు అందజేయలేదు.

అన్న క్యాంటీన్లు.. సిద్ధం

జిల్లాలో నాలుగు చోట్ల ఏర్పాటు

బాపట్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అన్న క్యాంటీన్ల ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగా గురువారం వాటిని ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. తొలి విడతలో భాగంగా జిల్లాలో 4 చోట్ల క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల ఆకలిని తీర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం ఐదు రూపాయలకే టిఫిన్, భోజనాన్ని ఈ క్యాంటీన్ల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తేనున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పురుడు పోసుకున్న ఈ పథకాన్ని వైసీపీ అధికారంలోకి రాగానే రద్దు చేసి పేదల పొట్ట కొట్టిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని చెప్పిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం వాటికి శ్రీకారం చుట్టింది.

జిల్లాలో ఏర్పాటు చేసేది ఇక్కడే...

అద్దంకిలోని ఎన్ఎస్‌పీ కార్యాలయం ప్రాంగణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నారు. బాపట్లలో మీ సేవ వెనుక ప్రాంతంలో, చీరాలలోని వాసవి క్లాత్ మార్కెట్ ఎదుట, రేపల్లెలో అంబేడ్కర్ పార్కు ఎదుట అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి.

అట్టహాసంగా.. హర్ ఘర్ తిరంగ

- ఆకట్టుకున్న 50 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన
- దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాలన్న ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, ఆగస్టు 13: విద్యార్థుల దేశభక్తి నినాదాలు.. 50 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శనతో బాపట్లలో మంగళవారం హర్ ఘర్ తిరంగ కార్యక్రమం ఆకట్టుకుంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్‌ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ హైస్కూల్ వద్ద ర్యాలీని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. ఈ ర్యాలీ గడియారస్తంభంసెంటర్ మీదగా అంబేద్కర్ సర్కిల్ చేరుకుని అక్కడి నుంచి భావన్నారాయణస్వామి దేవాలయం, తహసీల్దార్ కార్యాలయం మీదగా తిరిగి హైస్కూల్‌కు చేరుకుంది. విద్యార్థులు 50 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీకి అగ్రభాగాన నిలిచారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, ఎంఈవో ఎస్.నిరంజన్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంధ్రేయ, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్.నజ్మా, మండల మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, బీజేపీ నాయకులు మామిడి రమేష్ కుమార్, బాలనారాయణ, వల్లూరి భావన్నారాయణ, మాజీ ఎంపీపీ దాసరి యోహాను, మోదుగుల శంకరరెడ్డి, జి.గిరిజారాణి, ఎన్‌సీసీ ఆఫీసర్ కత్తి శ్రీనివాసరావు, పట్టణ సీఐ అహ్మద్‌జానీ పాల్గొన్నారు.



తిరంగా రన్‌లో 50 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



తిరంగా రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, తదితరులు

బాధితులకు లోకేశ్ భరోసా

- ప్రజాదర్బార్ 25వ రోజు వినతుల వెల్లువ



సమస్య పరిష్కరించాలని మంత్రి లోకేశ్‌కు అర్జీ అందిస్తున్న పీజీ విద్యార్థులు

7లో..

నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 14 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



సక్సెస్‌ను సెలబ్రేట్ చేద్దాం

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మంగళవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ "సరిపోదా... చిత్రంతో ప్రేక్షకులకు మంచి సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. మన సినిమా సక్సెస్‌ను థియేటర్లలో సెలబ్రేట్ చేద్దాం' అన్నారు. ఎస్. జే సూర్య మాట్లాడుతూ 'నాని గారి పాత్ర ఈ సినిమాలో ప్రతి శనివారం చేసే పనులు 'బాషా' చిత్రాన్ని గుర్తుకు తెస్తాయి' అన్నారు. సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని డీవీవీ దానయ్య చెప్పారు.

క్లుప్తంగా...

ధైర్యాన్ని నింపింది



నటుడిగా తొలి చిత్రం 'అలనాటి రామచంద్రుడు' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కృష్ణవంశీ. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం మంచి టాక్‌తో నడుస్తోంది. ఈ సందర్భంగా కృష్ణవంశీ మీడియాతో ముచ్చటించారు. "నా తొలి సినిమాకే ఇంతటి ప్రేక్షకాదరణ దక్కడం చాలా సంతోషంగా ఉంది. చాలా రోజుల తర్వాత ఓ స్వచ్ఛమైన ప్రేమకథను థియేటర్లలో చూశామని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ విజయం టీమ్ అందరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది" అని చెప్పారు.

ఐదు జంటల ప్రేమకథ



ఎం.ఎస్.వి సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఈనెల 29న విడుదలవుతోంది. హీరో ఆకాశ్ జగన్నాథ్ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఐదు ప్రేమ జంటల మధ్య సాగే అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దర్శకుడు చెప్పారు. శృతి శంకర్, విహారిక, అభిలాష్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అరమాన్. సినిమాటోగ్రఫీ: ఎస్. ప్రసాద్.

షారూఖ్‌ను దాటిన పాపులారిటీ



ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎండీబీ తాజాగా విడుదల చేసిన ఈ వారం అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ సెలబ్రిటీ జాబితాలో హీరోయిన్ శోభితా దూళిపాళ్ల పలువురు అగ్ర తారలను వెనక్కునెట్టి, రెండో స్థానం దక్కించుకున్నారు. షారూఖ్‌ఖాన్ ఆమె తర్వాతి స్థానంలో నిలిచారు. శార్వరీ అగ్రస్థానంలో నిలవగా, జాన్వీకపూర్ ఐదో స్థానంలో నిలిచారు. ఇటీవలే నాగచైతన్యతో శోభిత నిశ్చితార్థం జరిగిన నేపథ్యంలో నెటిజన్లు ఆమె గురించి తెలుసుకునేందుకు ఎక్కువగా సెర్చ్ చేశారు.

'మిస్టర్ బచ్చన్'ను గుర్తుంచుకుంటారు



రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవితేజ మాట్లాడుతూ "ఈ సినిమాలో మీరు కొత్త రవితేజను చూస్తారు. ఇందులోని ప్రేమకథ, పాటలు, యాక్షన్ ఎపిసోడ్స్ అద్భుతంగా వచ్చాయి. ఈ సినిమా థియేటర్లలో ఇరగదీస్తుంది. ప్రేక్షకులు చాలా కాలం గుర్తుంచుకుంటారు" అని చెప్పారు. "ఈ సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది. ఇది థియేటర్లలో ప్రేక్షకులతో విజిల్స్ వేయించే సినిమా. అనుకున్నదానికంటే బాగా వచ్చింది. దానిక్కారణం ఆయనంక బోస్ విజువల్స్, మిక్కీ.జే.మేయర్ సంగీతం. ఈ సినిమాకు రిపీట్ ఆడియెన్స్ ఉంటారు" అని దర్శకుడు హరీశ్ శంకర్ అన్నారు. "ఇది రవితేజతో నా మూడో సినిమా. ఈ సినిమాలో ప్రేక్షకులని ఆశ్చర్యపరిచే అంశాలు చాలా ఉన్నాయి. ఈ మాస్ ఎంటర్టైనర్ అందరికీ నచ్చుతుంది" అని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ తెలిపారు.



తిరుమలేశుడి సేవలో జాన్వీకపూర్

ప్రముఖ నటి శ్రీదేవి కుమార్తె, బాలీవుడ్ యాక్టర్ జాన్వీ కపూర్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె తన స్నేహితుడు శిఖర్ పహారియాతో కలిసి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. శ్రీదేవి జీవించి ఉండగా ఏటా తన పుట్టిన రోజు నాడు తిరుమల శ్రీవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందేవారు. జాన్వీకపూర్ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)


గురుదక్షిణగా రూ. 300



ఖరీదైన బహుమతులే అవ్వాల్సిన పనిలేదు... మనసు అంతరాళలో నుంచి పొంగిపొర్లే ప్రేమను వ్యక్త పరిచేందుకు ఇచ్చే బహుమతులు చిన్నవే అయినా వాటి విలువ అమూల్యమే. సీనియర్ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ తను గురువుగా భావించే మహేశ్‌భట్‌కు కూడా ఇలాంటి బహుమతినే అందించి, ఆశ్చర్యపరిచారు. ఇటీవలే ముంబైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మహేశ్‌భట్, అనుపమ్‌ఖేర్ వేదికను పంచుకున్నారు. తన సినీ ప్రయాణం గురించి వేదికపైన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు అనుపమ్‌ఖేర్. 'ఎవరైనా నా బయోపిక్ తీస్తే అందులో భట్ సాబ్‌ది ముఖ్యమైన పాత్ర అవుతుంద'ని ఆయన అన్నారు. అలా చెబుతూ వెంటనే తన జేబులో నుంచి రూ. 300 తీసి మహేశ్‌భట్‌కు అందజేసి, గురుదక్షిణగా స్వీకరించాలని కోరారు. మహేశ్‌భట్ ఆ నోట్లను సంతోషంగా స్వీకరించడమే గాకుండా వాటిని వేదికపైనుంచి అందరికీ చూపించి, జాగ్రత్తగా తన జేబులో దాచుకున్నారు. అనుపమ్‌ఖేర్ సినీ జీవితాన్ని మలుపుతిప్పిన చిత్రం 'సారాంశ్'. నటుడిగా ఆయనకు గొప్ప పేరు తెచ్చి కెరీర్‌లో నిలదొక్కుకునేలా చేసింది. 1984లో వచ్చిన ఈ చిత్రానికి మహేశ్‌భట్ దర్శకత్వం వహించారు.

సవాలుతో కూడుకున్న విషయం

తెలుగులోనూ మంచి పాపులారిటీ ఉన్న తమిళ సంగీత దర్శకుల్లో జి.వి.ప్రకాశ్ ఒకరు. ఆయన సంగీతం అందించిన లేటెస్ట్ చిత్రం 'తంగలాన్'. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇలాంటి పీరియాడికల్ ఫిల్మ్‌కు సంగీతం అందించడం చాలా సవాలుతో కూడుకున్న విషయం. ఇలాంటి నేపథ్యం ఉన్న సినిమాలకు పనిచేసే అవకాశం అరుదుగా వస్తుంటుంది. అందుకే ఈ చాన్స్ మిస్ చేసుకోవాలనుకోలేదు. ఒక సంగీత దర్శకుడిగా ఈ సినిమాకు పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఈ సినిమాకు ఎలాంటి సంగీతం అందించాలనే విషయమై చాలా పరిశోధన చేశాను. దర్శకుడు పా.రంజిత్ విజన్ చాలా బాగుంటుంది. థియేటర్లలో పూనకాలు తెప్పించే సన్నివేశాలు సినిమాలో చాలా ఉన్నాయి. ఇప్పటికే రిలీజైన పాటలకి మంచి స్పందన వస్తోంది" అని చెప్పారు.



డేట్ మార్చడమే 'స్త్రీ 2'కి కలిసొచ్చిందా?

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ గురువారం రెండు హిందీ చిత్రాలు విడుదలవుతున్నాయి. అవేమిటంటే.. అక్షయ్‌కుమార్ నటించిన 'ఖేల్ ఖేల్ మే', జాన్ అబ్రహం ప్రధాన పాత్ర పోషించిన 'వేదా'. వీటి కంటే ఒక రోజు ముందే రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ 2' రిలీజ్ అవుతోంది. ఈ మూడు చిత్రాల్లో మొదటి నుంచీ 'స్త్రీ 2' చిత్రం మీద ఎవరికీ అంచనాలు లేవు. దీనికి ప్రధాన కారణం హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు నాలుగేళ్లుగా సరైన హిట్ లేకపోవడం. అలాగే హీరో రాజ్‌కుమార్ రావుకు ఈ ఏడాది విడుదలవుతున్న మూడో సినిమా ఇది. అతనికి కూడా ఓహో అనిపించే హిట్ పడకపోవడం మరో కారణం. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ' చిత్రం 2018లో విడుదలై సూపర్ హిట్ అయింది. అప్పట్లోనే ఈ హారర్ కామెడీ రూ వంద కోట్లు వసూలు చేసింది. సాధారణంగా సీక్వెల్ అనగానే భారీ అంచనాలు ఉండడం సహజం. కానీ 'స్త్రీ' సీక్వెల్‌కు అంత క్రేజ్ రాకపోవడం గమనార్హం. మొదట ఈ సినిమాను కూడా గురువారమే విడుదల చేయాలనుకున్నారు. అప్పటికే రెండు భారీ చిత్రాలు పోటీలో ఉండడంతో భారీ ఓపెనింగ్స్ వస్తే గొప్పే అని అనుకున్నారు .కానీ అనూహ్యంగా గురువారం కు బదులు బుధవారమే సినిమాను విడుదల చేయాలని చివరి క్షణంలో నిర్ణయం తీసుకోవడం "స్త్రీ 2' కు కలసి వచ్చిందని ట్రేడ్ పండితులు అంటున్నారు. సోలో రిలీజ్ కావడంతో మొదటి రోజే రూ పది కోట్లకు పైగా కలెక్ట్ చేస్తుందని ఓ అంచనా.



టికెట్ల అడ్వాన్స్ బుకింగ్ జోరు చూస్తుంటే అంత మొత్తం వసూలు చేయడం ఈజీయే అని ట్రేడ్ పండితులు పేర్కొంటున్నారు. చిన్న చిత్రాల్లో 'గదర్ 2' చిత్రానిదే ఇప్పటివరకూ రికార్డ్. ఆ సినిమా తొలి వారం రూ 40.10 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడున్న అడ్వాన్స్ బుకింగ్ ట్రెండ్‌ను పరిశీలిస్తే 'స్త్రీ 2' దానిని అధిగమించి, రూ 50 కోట్లు వసూలు చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇప్పటివరకూ 'స్త్రీ 2' చిత్రానికి సంబంధించి 2.21 లక్షల టికెట్లు అడ్వాన్స్‌గా బుక్ అయ్యాయి. దీని వల్ల రూ. 6.87 కోట్లు వసూలు అయ్యాయి. మహారాష్ట్ర, ఢిల్లీ సర్క్యూట్స్ లోనే అత్యధిక టికెట్లు అమ్ముడవడం విశేషం. ఓపెనింగ్ రోజు థియేటర్ల దగ్గర అమ్మకాలు ఉంటాయి కనుక రూ పది కోట్లు వసూలు చయడం పెద్ద కష్టమేమీ కాదని చెబుతున్నారు. అదే నిజమై 'స్త్రీ 2' తొలి వారం రూ 50 కోట్లు వసూలు చేస్తే హారర్ కామెడీ చిత్రాల్లో ఇదే హయ్యెస్ట్ రికార్డ్ అవుతుంది. ఈ అంకెలు ఎంతవరకూ నిజమవుతాయో కొన్ని గంటల్లో తేలిపోతుంది కనుక వేచి చూద్దాం.

ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఎంబీఏ: ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్ ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్‌ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్‌ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ఎంసీఏ: ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 19
- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- **వెబ్‌సైట్:** audoa.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8tClgiXలో చదవండి.

దిక్సూచి

మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్

కే.సీ.మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్-'మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్'నకు దరఖాస్తులు కోరుతోంది. దీనిని జాబ్ ఓరియంటెడ్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చేస్తున్న అభ్యర్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు ఉద్దేశించారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బాలికలకు, అల్పాదాయ కుటుంబాల్లోని పిల్లలకు, దివ్యాంగులకు, సైనిక దళాల్లో పనిచేస్తున్నవారి పిల్లలకు ప్రాధాన్యమిస్తారు. మొత్తం 550 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.10,000లు చొప్పున మూడేళ్ల స్కాలర్‌షిప్ అందిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం ఏదేని పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** www.kcmet.org

బాధితులకు లోకేశ్ భరోసా



దివ్యాంగుల సమస్యలు వింటున్న మంత్రి లోకేశ్

● ప్రజాదర్బార్ 25వ రోజు వినతుల వెల్లువ

తాడేపల్లి టౌన్, ఆగస్టు 13: ఉండవల్లిలోని నివాసంలో మంగళవారం 25వ రోజు జరిగిన ప్రజాదర్బార్‌కు మంగళగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంత్రి లోకేశ్‌ను నేరుగా కలిసి తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తి పరిశీలించిన మంత్రి సత్వర పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలోని జామాయిల్‌తోట ప్రాంతంలో 300 మీటర్ల సిమెంటు రోడ్డు నిర్మాణంతోపాటు డ్రైనేజి సదుపాయం కల్పించాలని పి.సంపత్‌కుమార్ నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన తిరువీధుల నాగశ్రావణి కోరారు. రోడ్డు ప్రమాదంలో తమ కుమారుడు మృతిచెందాడని ప్రమాదబీమా చెల్లింపుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని దుగ్గిరాలకు చెందిన ఎస్ దుర్గామల్లేశ్వరి విజ్ఞప్తి చేశారు. బ్రెయిన్‌ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న తన కుమార్తెకు వైద్యసాయం అందించడంతోపాటు పెన్షన్ మంజూరుచేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన మహ్మద్ అబ్దుల్ ముజీబ్ విజ్ఞప్తి చేశారు. అద్దె ఇంటిలో జీవనం సాగిస్తున్న తనకు ఎలాంటి ఆధారం లేదని ఇల్లు మంజూరు చేయాలని పోలకంపాడుకు చెందిన మోక నారాయణమ్మ కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి అండగా ఉంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమ సమయంలో షామియానాలు, డ్రింకింగ్ వాటర్ సరఫరా చేసిన తనకు గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని బిల్లుల మంజూరుకు ఆదేశాలు ఇవ్వాలని సిరిపల్లి నారాయణమూర్తి కోరారు. బాపట్ల జిల్లా, పర్చూరులోని బీఏఆర్ అండ్ టీపీ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించేందుకు అవసరమైన జీవో జారీచేయాలని సిబ్బంది కోరారు. విజయవాడ సిద్దార్థ వైద్యకళాశాలలో అనాటమీ విభాగానికి చెందిన హెచ్‌వోడీ డాక్టర్ చిత్ర వేధింపులకు గురి చేస్తున్నారని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పీజీ విద్యార్థులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. తీవ్ర అనారోగ్యం బారినపడి చికిత్స పొందిన తనకు వైద్యఖర్చులు రూ.8లక్షల వరకు అయ్యాయని, సీఎంఆర్ఎఫ్ కింద ఆదుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చెందిన మొగిలి శాంతి విజ్ఞప్తి చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో రాజబొమ్మంతిలోని తన 10 ఎకరాల పొలం, ఇంటి స్థలాన్ని గత ప్రభుత్వం అండతో కబ్జా చేశారని విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలని రాపర్తి మాణిక్యాలరావు కోరారు. భర్త చనిపోయిన తనకు వితంతు పెన్షన్ మంజూరుచేయాలని గుంటూరుకు చెందిన కె.ప్రశాంతి కోరారు. ప్రకాశం జిల్లా నాగిరెడ్డిపాలెంలో వంశపారంపర్యంగా వచ్చిన తన 1.12 ఎకరాల భూమిని గత ప్రభుత్వ అండతో కబ్జా చేశారని, తగిన న్యాయం చేయాలని గుమ్మళ్ల బ్రహ్మయ్య కోరారు. విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో 22 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనర్ల పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లా, మార్కాపురం మండలం అయినముక్కల గ్రామంలో 11మంది కలిసి కొనుగోలు చేసిన 78.71 ఎకరాలను గత ప్రభుత్వ అండతో వైకాపా నాయకులు కబ్జా చేశారని, విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలని పల్నాడు జిల్లా ఓబులేసుని పల్లెకు చెందిన మాగులూరి నారయ్య కోరారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో తిరిగి చేర్చేందుకు చర్యలు చేపట్టాలని బుడగ జంగం సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ వ్యవసాయ మార్కెట్‌లో అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేసిన తమను గత ప్రభుత్వం తొలగించిందని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిబ్బంది కోరారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

గురజాల జీడీసీసీబీ కుంభకోణంపై రికార్డుల పరిశీలన

పిడుగురాళ్ల, ఆగస్టు 13: గురజాలలోని జీడీసీసీ బ్యాంక్‌లో రెండు రోజులుగా ఆప్కాబ్, సహకార సంఘ అధికారులు సంయుక్తంగా రికార్డులను పరిశీలించారు. సుమారు 150 మంది రైతుల పేర్లతో రూ.6కోట్ల రుణాలు పొందిన వ్యవహారంపై అన్ని కోణాలలో పరిశీలించారు. మిర్చి నిల్వవుంచిన కోల్డ్ స్టోరేజ్‌ను పరిశీలించారు. మొత్తం మీద ఆప్కాబ్, సహకార సంఘ అధికారుల పరిశీలనలో మిర్చి నిల్వలు లేకుండానే రుణాలు మంజూరు చేసినట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి తగు నివేదిక పంపేందుకు ఆయా శాఖల అధికారులు సిద్ధమవుతున్నారు.

సురక్షిత తాగునీరందించటమే జలజీవన్ మిషన్ లక్ష్యం

● దేచవరం జలజీవన్ మిషన్ అమలు తీరు భేష్

● కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ సాంకేతిక అధికారి టీ మాధవ్

నకరికల్లు, ఆగస్టు 13: ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరును అందించటమే జలజీవన్ మిషన్ లక్ష్యమని కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ సాంకేతిక అధికారి టీ మాధవ్ అన్నారు. మంగళవారం నకరికల్లు మండలం దేచవరం గ్రామంలో అమృత్ సరోవర్ ట్యాంక్‌ను పరిశీలించారు. దేచవరంలో జలజీవన్ మిషన్ నిర్వహణ తీరు చక్కగా ఉందని ఆయన అన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా జరిగిన అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. 2019లో ఆగస్టు 15న ఈ పథకాన్ని ప్రారంభించారని, 2024 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. వివిధ కారణాలతో సకాలంలో పనులు పూర్తికాకపోవటంతో 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఆర్ సురేష్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి 55 లీటర్లు క్లోరినేషన్ చేసిన సురక్షిత తాగునీరందించేలా పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. 0.2 పీపీఎం ఉండేలా పరీక్షలు నిర్వహించి ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. దేచవరంలో నిర్మించిన జలజీవన్ మిషన్ అంచనా వ్యయం రూ 76 లక్షలు కాగా పైపులైన్, వాటర్ ట్యాపుల కోసం రూ 55లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎంపీ నిధులు రూ 10లక్షల వరకు కేటాయించినట్లు తెలిపారు. గ్రామంలో మొత్తం 1265 ట్యాప్ కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉందన్నారు. కాగా గ్రామ ప్రజలు నూతనంగా ఏర్పాటైన బీసీ కాలనీకి, ఎస్సీ కాలనీకి ఈ పథకం వర్తింపచేయాలని అధికారుల దృష్టికి తెచ్చారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఓహెచ్‌ఆర్ కోసం, చెరువు కట్ట బలోపేతం కోసం రూ 70లక్షలు వరకు నిధులు కేటాయించాలని మాజీ జడ్పీటీసీ భవనం రాఘవరెడ్డి అధికారులను కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ కే రత్నబాబు, డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్లు తేజ్ సంగీత్, రంగారావు, డ్వామా పీడీ గంగవరపు జోసెఫ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నర్రా మమత, సర్పంచ్ నామేపల్లి ఆదిలక్ష్మి, బోడపాటి వెంకటరావు, దొండేటి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమృత్ సరోవర్ ట్యాంక్ రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ సాంకేతిక అధికారి టీ మాధవ్

ఫోన్‌పే, గూగుల్ పే చెల్లింపుల నిలిపివేతతో విద్యుత్‌శాఖకు షాక్

● చెల్లింపుల్లో డిస్కం పరిధిలో రూ.కోట్లలోనే వ్యత్యాసం..

● తిరిగి ఫోన్‌పే చెల్లింపులకు అవకాశం.. త్వరలో గూగుల్ పేలో కూడా..

గుంటూరు, ఆగస్టు 13: విద్యుత్‌బిల్లుల చెల్లింపుల కోసం ఫోన్‌పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపులకు వినియోగదారులను ప్రోత్సహించిన విద్యుత్ పంపిణీ సంస్థలు ఇటీవల ఆ చెల్లింపులు నిలిపివేయటంతో ఊహించని షాక్ తగిలింది. నెల రోజుల వ్యత్యాసంలోనే బిల్లుల చెల్లింపులు భారీగా తగ్గిపోవటంతో ఆ శాఖ అధికారులను ఖంగు తినిపించింది. దాంతో తిరిగా ఉన్నతాధికారులు ఫోన్‌పే చెల్లింపులు తిరిగి పునరుద్ధరించినట్లు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు విద్యుత్‌పంపిణీ సంస్థ ఏపీసీపీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్‌తో పాటు ఫోన్ పేతో కూడా ఇకపై చెల్లింపులు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. సాధారణంగా విద్యుత్‌రెవెన్యూ కార్యాలయాలకు వచ్చి క్యూలలో వేచి ఉండటం వంటి వ్యయప్రయాసలు లేకుండా ప్రత్యామ్నాయ చెల్లింపులకు వినియోగదారులను ప్రోత్సహించారు. ఆన్‌లైన్ చెల్లింపులతో పాటు స్మార్ట్‌ఫోన్‌ల వినియోగం పెరిగాక ఫోన్‌ల నుంచే బిల్లుల చెల్లింపు జరుపుకునేలా ఫోన్ పే, గూగుల్ పేలను ప్రోత్సహిస్తూ వినియోగదారులకు అవగాహన కూడా కల్పించారు. తద్వారా బిల్లుల చెల్లింపు ఎంతో సులభతరంగా మారింది. విద్యుత్‌శాఖకు కూడా సకాలంలో బిల్లుల బకాయిలు ఖజానాకు వచ్చి చేరాయి. కొన్ని సాంకేతిక కారణాలతో గత నెలాఖరున ఫోన్‌పే, గూగుల్‌పే చెల్లింపులు చెల్లవని ప్రకటించారు. దాంతో వినియోగదారుల్లో తీవ్ర గందరగోళం వ్యక్తమైంది. ఇప్పటి వరకు ఫోన్ పే, గూగుల్ పేల సాయంతో విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అలవాటుపడిన వినియోగదారులు ఏపీసీపీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులు తెలియక విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలకు పెద్దఎత్తున చేరుకున్నారు. దాంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, చెల్లింపు కేంద్రాల వద్ద చాంతాడంత క్యూ కనిపించింది. నల్లచెరువు ఈఆర్‌వో కార్యాలయం ఎదుట రెండు కౌంటర్లను ఏర్పాటు చేసినప్పటికీ వినియోగదారుల రద్దీ తగ్గని పరిస్థితి నెలకొన్నది. అయితే ఫోన్‌పే, గూగుల్ పే చెల్లింపుల నిలిపివేత సాంకేతిక కారణాలతోనే జరిగిందని ఇందులో ఎవరి ప్రమేయం లేదని చెబుతున్నారు.

సీపీడీసీఎల్ పరిధిలో రూ.కోట్లలోనే తేడా....

ఫోన్ పే, గూగుల్ పే చెల్లింపుల నిలిపివేతతో సీపీడీసీఎల్ పరిధిలో రూ.కోట్లలోనే చెల్లింపుల బకాయిలు నిలిచిపోయినట్లు సమాచారం. సీపీడీసీఎల్ పరిధిలోని విజయవాడ, సీఆర్‌డిఏ, గుంటూరు, ఒంగోలు సర్కిల్స్ పరిధిలోని మొత్తం బకాయిలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయని ఆ శాఖ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇలా అయితే పరిస్థితి తారుమారయ్యే ప్రమాదముందని ఉన్నతాధికారులు పునరాలోచనలో పడ్డారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల జోక్యంతో ఫోన్ పేతో కూడా చెల్లింపులు పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. మరో నాలుగైదు రోజుల్లో గూగుల్‌పేతో కూడా విద్యుత్ బిల్లుల చెల్లింపులు అందుబాటులో రానున్నట్లు ఆ శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటినిల్వ

● 0.35 ఎంయూల విద్యుత్ తయారీ: ఎస్ఈ వెంకటరమణ

రెంటచింతల, ఆగస్టు 13: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 7.08 టీఎంసీలు కాగా మంగళవారం రాత్రి వరకు 7 టీఎంసీల నీటిని నిల్వ వుంచినట్లు ఎస్ఈ కొలేగుండ్ల వెంకటరమణ చెప్పారు. ఎగువన వున్న సాగర్ నుంచి 29,800 క్యూసెక్కుల నీరు వస్తుండగా ప్రాజెక్టు నుంచి 30 వేల క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టుకు చెందిన 2 గేట్లు 1.5 మీటర్లు, మరో 2 గేట్లను 2 మీటర్ల మేర ఎత్తి 22 వేలు, విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నామన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.35 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 18 వేల క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 16వేల క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 13: ఎగువ ప్రాజెక్టుల నుండి భారీగా వరదనీరు ప్రకాశం బ్యారేజి వద్ద చేరుతుండటంతో వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 28 వేలు, కీసర వాగు నుండి 6వేల క్యూసెక్కుల వంతున మొత్తం 34 వేల క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 25 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 18వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 16వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 11: నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం మంగళవారం నాటికి 589.50 అడుగులు ఉంది. ఇది 310.55 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7086 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8629, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,232, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 47,347 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,30,347 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో పోస్టల్ పార్శిల్ బుకింగ్ సౌకర్యం

గుంటూరు, ఆగస్టు 13: ప్రజల సౌకర్యం కోసం గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో 24 గంటలు పోస్టల్ బుకింగ్ సౌకర్యం సోమవారం నుంచి అందుబాటులోకి తెచ్చినట్లు ఆర్ఎంఎస్ సూపరింటెండెంట్ జీవీ బాలసరస్వతి తెలిపారు. దేశంలో ఏ మారుమూల గ్రామానికైనా, ముఖ్యంగా రిజిస్టర్డ్ పార్శిల్స్‌ను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు గుంటూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ (9959126452)ను సంప్రదించాలని కోరారు. ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బస్టాండ్‌లో పోస్టల్ పార్శిల్ బుకింగ్‌ను ప్రారంభించిన ఆర్ఎంఎస్ సూపరింటెండెంట్ బాలసరస్వతి తదితరులు

జాతీయ, అంతర్జాతీయ మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉండాలి

● రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 13: మద్యం ప్రియులకు జాతీయ, అంతర్జాతీయ మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉండాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం గుంటూరు నల్లపాడులోని ఐ.ఎం.ఎల్ డిపో, మద్యం దుకాణంలో తనిఖీలు చేశారు. డిపోలోని ఇండెంట్ వ్యవస్థ పనితీరు, ఆ వ్యవస్థ విధివిధానాలు, షాపుల నుండి ఇండెంట్ ఎలా పెడతారు, ఆ ఇండెంట్‌ని బట్టి స్టాక్‌ని డిపో నుండి ఎలా పంపిణీ చేస్తారన్న వివరాలను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అదేవిధంగా నల్లపాడులోని ఒక మద్యం దుకాణాన్ని సందర్శించి అక్కడ సిబ్బందిని ఏఏ పనులు చేస్తారని, ఇండెంట్ ఎలా పెడతారని, ఏఏ బ్రాండ్లు ఎక్కువ అమ్ముడుపోతున్నాయని పరిశీలించారు. ఈ సందర్భంగా నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో గుంటూరు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జి రావు, అబ్కారీ సూపరింటెండెంట్, డిపో మేనేజర్ వెంకట్రామిరెడ్డి, అబ్కారీ సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



నల్లపాడు ఐఎంఎల్ డిపోలో స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎక్సైజ్ రాష్ట్ర కమిషనర్ నిశాంత్‌కుమార్, పక్కన డీసీ బాబ్జీరావ్

పిడుగు పాటుకు వృద్ధుడి మృతి

చిలకలూరిపేట, ఆగస్టు 13: చిలకలూరిపేట రూరల్ మండలంలోని పసుమర్రు గ్రామంలో పిడుగుపాటుకు తన్నీరు నరసింహారావు(78) మృతి చెందాడు. గ్రామంలోని బ్రహ్మంగారి గుడి సమీపంలో నివాసం ఉంటున్న నరసింహారావు స్నానం చేస్తుండగా సమీపంలోనే పిడుగు పడింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు.

అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

● గుంటూరు జిల్లాలో 14 చోట్ల ఏర్పాటు

● లాంఛనంగా ప్రారంభించనున్న ప్రొటోకాల్ మంత్రి నారా లోకేశ్

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లు తిరిగి తెరుచుకోబోతున్నాయి. 2019 జూన్ నెల ముందువరకు మూడు పూటల పేదల కడుపు నింపి భోజనాలయాలుగా పేరుగాంచిన ఈ అన్న క్యాంటీన్‌లను వైసీపీ ప్రభుత్వం అప్పట్లో అధికారంలోకి వస్తూనే మూసేసింది. ఆ తర్వాత వాటిని పట్టించుకోకుండా శిథిలావస్థకి చేర్చింది. అన్న క్యాంటీన్‌లు ఏ పాపం చేశాయని అటు ప్రతిపక్షాలు ఇటు ప్రజలు ప్రశ్నించినా వైసీపీ నేతల కర్కశ మనసులు కరగలేదు. తెలుగుదేశం పార్టీ తరుపున దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాటిని నిర్వహించేందుకు చేసిన ప్రయత్నాలను కూడా అడ్డుకొనేందుకు అధికారాన్ని ఉపయోగించింది. అయినప్పటికీ చాలాచోట్ల అన్న క్యాంటీన్‌లను తాత్కాలిక ప్రదేశాల్లో తెలుగుదేశం పార్టీ నిర్వహించి పేదల ఆకలి తీరుస్తూ వచ్చింది. ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే అన్న క్యాంటీన్‌లు పునఃప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు మాట ఇచ్చారు. ఆ మేరకు ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిల్లాలో 14 చోట్ల అన్న క్యాంటీన్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

జిల్లాలో అమరావతి రోడ్డులోని ఐడీ హాస్పిటల్, స్వర్ణభారతీనగర్ సమీపంలోని డీటీసీ ఆఫీసు, మిర్చియార్డు, నల్లచెరువు వాటర్ ట్యాంకు, పల్నాడు బస్టాండ్, ఆర్‌టీసీ బస్టాండ్ రైతుబజార్, చుట్టుగుంట సమీపంలోని వ్యవసాయ శాఖ కమిషనరేట్, మంగళగిరి తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత ఆర్‌టీసీ బస్టాండ్, నులకపేట, ఉండవల్లి, పొన్నూరులోని సుబ్బరాయసత్రం, తెనాలిలోని మునిసిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న కూరగాయల మార్కెట్, మార్కెట్‌యార్డు, ఆర్‌టీసీ కాంప్లెక్స్‌ల వద్ద అన్న క్యాంటీన్‌లను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆయా మునిసిపల్ కార్పొరేషన్‌లు, పురపాలక సంఘాలు పనులు చేపట్టాయి. అల్యూమినియం క్లాడింగ్ ఫినిషింగ్‌తో కొత్త లుక్‌ని తీసుకొచ్చాయి. ఒక్కో క్యాంటీన్‌లో సదుపాయాల కల్పనకు దాదాపుగా రూ.9లక్షల వరకు నిధులు వినియోగిస్తున్నట్లు మునిసిపల్ వర్గాలు తెలిపాయి. వీటిని గురువారం జిల్లా కేంద్రంలో మంత్రి నారా లోకేశ్ లాంఛనంగా ప్రారంభిస్తారు. నిత్యం ఒక్కోపూట మూడువందల మందికి పైగా పేదలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం కేవలం రూ.5కే రుచికరంగా వడ్డించనున్నారు.

తెనాలిలో 250 అడుగుల భారీ జాతీయ జెండా ప్రదర్శన

తెనాలి అర్బన్, ఆగస్టు 13: అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం 250 అడుగుల భారీ జాతీయ పతాకాన్ని ఊరేగించారు. పట్టణంలోని పలు రహదారుల గుండా ర్యాలీ చేసి జాతి సమైక్యతను దేశ సమగ్రతను కాపాడాలంటూ నినాదాలు చేశారు. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా ప్రముఖ్ అవ్వారు శ్రీనివాసరావు, ఏబీవీపీ గౌరవ అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీనివాసరావు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశభక్తి, క్రమశిక్షణ ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని, దేశం పట్ల విధేయత లేని వారికి దేశంలో ఉండే అర్హత లేదన్నారు. 500మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొంటూ జైభారత్ నినాదాలతో హోరెత్తించారు. పర్యావరణ కార్యదర్శి శేషు, పవన్ కుమార్, లోకేష్‌చంద్ర, హేమంతరామ్ పాల్గొన్నారు.



250 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

బాపట్లలో రెండు రాష్ట్రాల వేదసదస్సు



రెండు రాష్ట్రాల వేదసదస్సులో పండితులు, వేద విద్యార్థులు

బాపట్ల, ఆగస్టు 13: విశ్వాన్ని నడిపించగల మహత్తరమైన సంకల్పం సర్వజగత్తును నడిపించగల శక్తి ఒక్క వేదనాదానికి ఉందని మహర్షుల భావన అని, అటువంటి వేదనాద వ్యాప్తికి ప్రతి ఒక్కరు కృషిచేయాల్సిన అవసరం ఉందని పలువురు పండితులు అభిప్రాయపడ్డారు. శ్రీశంకర విద్యాలయ వ్యవస్థాపకులు శ్రీబ్రహ్మానంద తీర్థస్వామి 145వ జయంతి ఉత్సవాలలో భాగంగా బాపట్లలోని శ్రీశంకర విద్యాలయంలోని వేదపాఠశాలలో మూడురోజులపాటు జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల వేదసదస్సులో అనేకమంది పండితులు పాల్గొని ప్రవచనాలు చేశారు. 40మంది వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్న ఈ సదస్సుకు కపిలవాయి రామశాస్త్రి అధ్యక్షత వహించగా గుళ్ళపల్లి చినఆంజనేయ ఘనాపాటి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు పర్యవేక్షకులుగా వ్యవహరిచారు. వేదనాదాలతో ప్రతిధ్వనించే ఏ క్షేత్రంలోనైనా దేవతలు కొలువై ఉంటారన్నారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యుత్తమ వైదిక సంస్కృతి, ఆధ్యాత్మికత విద్య, విజ్ఞాన విద్యావ్యాప్తికి ప్రబోధ ప్రచారాల ద్వారా నాటి మహాతపస్వి పరమహంస పరివ్రాజకాచార్య బ్రహ్మానంద తీర్థస్వామి తెలుగు రాష్ట్రాలలో విశేషంగా కృషిచేశారని కొనియాడారు. కొన్నివేలమంది పండితులుగా తయారుకావటానికి ఈ పాఠశాలలు అందించిన విద్యాబోధన ఉపకరించిందన్నారు. కార్యక్రమంలో శ్రీశంకర విద్యాలయ వేదపాఠశాల నిర్వాహకులు శిఖరం భుజగేంద్ర మౌళి, చలపతిరావు, బి.బాబునాగేంద్ర, పండితులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఆరునెలల జైలు

మంగళగిరి, ఆగస్టు 13: చెల్లనిచెక్కు కేసులో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.6లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే సురేష్‌బాబు మంగళవారం తీర్పును వెలువరించారు. మంగళగిరికి చెందిన కొదమల కుమార్ అనే వ్యక్తి నుంచి ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ జంగా పద్మజ రూ.పది లక్షలను అప్పుగా తీసుకుని పార్ట్‌పేమెంట్ కింద 2019లో రూ.ఆరులక్షల చెక్కును ఇచ్చింది. ఈ చెక్కును కెనరా బ్యాంకులో వేయగా అది బౌన్స్ అయింది. ఈ మేరకు బాధితుడు కుమార్ మంగళగిరి కోర్టులో చెక్ బౌన్స్ కేసు వేయగా వాదోపవాదాల అనంతరం న్యాయమూర్తి కే సురేష్‌బాబు వైద్యురాలు పద్మజకు ఆరు నెలలపాటు జైలుశిక్షతోపాటు ఫిర్యాదికి రూ ఆరు లక్షలను నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశాలను ఇచ్చారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.86 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	94, 102,113
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్ లెస్	192.00

52,954 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 55,002 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 52,954 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 23,296 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000	334	8000	15500
నెంబరు. 5	8500	12000	నెంబరు. 5	12000	12000
273	9000	12500	273	–	–
341	9000	15500	341	9000	15000
4884	–	–	4884	8500	14000
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18700	తేజ	8500	18500
బ్యాడిగి	8500	16500	బ్యాడిగి	9500	14500
దేవనూరుడీలక్స్	9500	15500	దేవనూరుడీలక్స్	9000	13200
తెల్లకాయలు	4500	10500	తెల్లకాయలు	4500	10000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

రాష్ట్రస్థాయి పోటీలలో విజయం సాధించాలి : ఎస్పీ

బాపట్ల, ఆగస్టు 13 : జిల్లా స్థాయి యోగా పోటీలలో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎస్పీ తుషార్‌డూడీ అభినందించారు. చీరాలకు చెందిన యోగాటీచర్ వి.సుబ్బారావు వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 14, 15 తేదీలలో వైజాగ్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు చీరాల భాష్యం, నారాయణ, విజ్ఞానభారతి పాఠశాలల విద్యార్థులు పాల్గొననున్నారు. వీరంతా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిశారు. పెన్సిల్‌తో ఎస్పీ ఫొటోను చిత్రీకరించి ఆయనకు బహుమతిగా అందజేశారు. విద్యార్థులను ఎస్పీ అభినందించి రాష్ట్రస్థాయి పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కళాత్మకంగా తయారు చేసిన బొకేలు, పెన్సిల్ ఆర్ట్‌ను చూసి ఎస్పీ వారి సృజనాత్మకతను అభినందించారు.

కష్టపడి చదువుకొని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

● అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రేణుక

బాపట్ల, ఆగస్టు 13 : విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రేణుక తెలిపారు. మండలంలోని వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాల, కళాశాలలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు జడ్జి రేణుక ముఖ్యఅతిథిగా పాల్గొని న్యాయ సలహాలు ఇచ్చారు. తదుపరి విద్యార్థుల వసతి గృహాలు, కిచెన్, విద్యార్థుల మెనూ తనిఖీ చేశారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రేణుక

తాడి, నీరా ఫైనాన్స్ కార్పొరేషన్ పునరుద్ధరించాలని వినతి



మంత్రి లోకేశ్‌తో తాతా జయప్రకాష్ నారాయణ, తాతా హరిశ్చంద్రప్రసాద్

బాపట్ల, ఆగస్టు 13 : గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉండే తాడి అండ్ నీరా ఫైనాన్స్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ మంగళవారం రాష్ట్ర ఐటీ అండ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిలోని ఆయన నివాసంలో తాతా హరిశ్చంద్రప్రసాద్‌తో కలిసి వెళ్ళి పలువిషయాలను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్ళారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కల్లుగీత ఫైనాన్స్ కార్పొరేషన్‌ను గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రైసైన, యాత కార్పొరేషన్లుగా 5 చేసినట్లు వివరించారు. కార్పొరేషన్‌లను అదేవిధంగా ఉంచాలా లేక కల్లుగీత ఫైనాన్స్ కార్పొరేషన్‌గా ఒకటే చేయాలా అనే విషయంపై చర్చించారు. ఆశావహులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో 5 కార్పొరేషన్లు ఉంచటమే మంచిదని జయప్రకాష్ నారాయణ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్ళారు. వైసీపీలో నిలిపివేసిన తాడి అండ్ నిరా ఫైనాన్స్ కార్పొరేషన్‌ను పునరుద్ధరిస్తే కేంద్రం నుంచి నిధులు వస్తాయని చెప్పారు. నామినేటెడ్ పదవులలో తనకు అవకాశం కల్పించాలని మంత్రి లోకేశ్‌ను కోరారు.

మహిళా చైతన్యదీప్తి కనుపర్తి : డాక్టర్ సాయిబాబు

బాపట్ల, ఆగస్టు 13 : మహిళలలో చైతన్యం రగిలించి వారిని స్వాతంత్రోద్యమంలో భాగస్వాములు చేసిన ఘనత కనుపర్తి వరలక్ష్మమ్మకే దక్కుతుందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. వరలక్ష్మమ్మ 46వ వర్ధంతి కార్యక్రమాన్ని ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం శీలంవారి పాలెంలో గల ఆమె విగ్రహం వద్ద నిర్వహించారు. వరలక్ష్మమ్మ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో సాయిబాబు మాట్లాడుతూ మహాత్మాగాంధీ శిష్యురాలిగా జీవితాంతం నేతచీరలే ధరించి మహిళలచేత వరలక్ష్మమ్మ రాట్నలక్ష్మీ వ్రతాలు చేయించారన్నారు. వారిచేత నూలు వడికించారన్నారు. ఓటుపురాణం రచించి స్త్రీలందరూ ఎన్నికలలో ఓటువేయాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సుబ్బారావు, అధ్యాపకులు నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



వరలక్ష్మమ్మ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడుతున్న ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు తదితరులు

అవయవదానం ప్రధానమైనది : డాక్టర్ శరత్‌బోస్

బాపట్ల, ఆగస్టు 13 : అవయవదానం ప్రధానమైనదని డాక్టర్ శరత్‌బోస్ అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవంను పురస్కరించుకొని బాపట్ల కొత్తబస్టాండ్‌లో గల ఏకోహాస్‌లో రక్తదాన, అవయవదాన, శరీరదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రెడ్‌క్రాస్ సొసైటీవారు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అవయవ, శరీర దానం చేసే వారి రిజిస్ట్రేషన్ చేశారు. రక్తదానం చేసేందుకు 16 మంది, అవయవదానం చేసేందుకు 50 మంది పేర్లు నమోదు చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం జరిగిన సభలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ముందు ముందు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హక్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణ భట్టు, విశ్రాంత ప్రొఫెసర్ సీహెచ్ సత్యనారాయణ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో స్కూల్ బస్సుల తనిఖీ

బాపట్ల, ఆగస్టు 13 : రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా రవాణాశాఖాధికారి సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రైవేట్ స్కూల్స్ అండ్ కళాశాలల బస్సులను తనిఖీ చేశారు. బాపట్ల మోటారు వాహనాల తనిఖీ అధికారుల బస్సులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. పరిమితికి మించి పిల్లలను తరలిస్తున్న ఆటోలను, హెల్మెట్‌లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహన చోదకులను, సెల్‌ఫోన్‌లో డ్రైవింగ్ చేస్తున్నవారిని తనిఖీ చేసి సరైన పత్రాలు చూపనివారికి జరిమాన విధించారు. పరిమితికి మించి పిల్లలను తరలిస్తున్న ఒక బస్సు, ఒక ఆటో, ఒక టాటా మ్యాజిక్‌పై కేసులు నమోదు చేశారు. అదేవిధంగా మూడు ద్విచక్రవాహనాలపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రవాణశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్ల ఎమ్మెల్యేను కలిసిన టీడీపీ యువనాయకులు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 13 : మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని ప్రకాశం జిల్లా దర్శినియోజకవర్గంలో జరిగిన ఓ కార్యక్రమంలో చందోలు గ్రామానికి చెందిన టీడీపీ యువనాయకులు సయ్యద్ నిజాం, టీడీపీ మండల మైనార్టీ నాయకుడు షేక్ మీరా మర్యాదపూర్వకంగా ఆయను కలిశారు.

ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలి

● రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్‌యాదవ్

బాపట్ల,ఆగస్టు 13 : సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్‌యాదవ్ తెలిపారు. కలెక్టర్, ఈఆర్వోలతో మంగళవారం ఆయన అమరావతి నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి బాపట్ల కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జె.వెంకటమురళీ, జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఈఆర్వోలు హాజరయ్యారు. సంక్షిప్త ఓటర్ల జాబితా రూపొందించటానికి ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు ఇంటింటా సర్వే ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. అక్టోబరు 19 నుంచి 28 వరకు దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. అక్టోబరు 29న సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. సెప్టెంబరు 29 నుంచి నవంబరు 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. తదుపరి ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. డిసెంబరు 24వ తేదిలోగా వచ్చిన దరఖాస్తులు పరిశీలించి పరిష్కార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 2025 జనవరి 1వ తేదీలోగా నిబంధనల మేరకు జాబితా సిద్ధమైందో లేదో పరిశీలించాలన్నారు. 2025 జనవరి 6వ తేదీన సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని ఆయన తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలు పక్కాగా అమలు చేయాలన్నారు.

రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ ప్రకటిస్తాం

● రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సుసోడియా

త్వరలో జరగనున్న రెవెన్యూ సదస్సులో షెడ్యూల్ ప్రకటిస్తామని రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సుసోడియా తెలిపారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై మంగళశారం వీక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్ల నుంచి కలెక్టర్ జె.వెంకటమురళీ, జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీక్షణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన సదస్సులు తాత్కాలికంగా వాయిదా పడ్డాయన్నారు. తదుపరి తేదీ ప్రకటిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



వీక్షణా సమావేశంలో కలెక్టర్ జె.వెంకటమురళీ, జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తదితరులు

గృహనిర్మాణ లక్ష్యాలు చేరుకోవటానికి చిత్తశుద్ధితో పనిచేయాలి : కలెక్టర్

గృహ నిర్మాణాలలో లక్ష్యాలు చేరుకోవటానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళీ తెలిపారు. గృహనిర్మాణాలలో 100 రోజుల ప్రణాళికపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షా నిర్వహించారు. పక్కా గృహనిర్మాణాలు వేగంగా జరిగేలా లబ్ధిదారులలో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ చెప్పారు. సిమెంట్, ఇనుము, ఇసుక వంటి సామాగ్రి అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. జిల్లాలో 50,415 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 16,348 గృహాల నిర్మాణం పూర్తి అయ్యిందన్నారు. 100 రోజులలో 1742 గృహాలు నిర్మించాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. రానున్న సంవత్సరంలో జూన్‌లోగా 22,001 గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. అలాగే 6వేల గృహాలు ఒక దశ నుంచి మరొక దశ వరకు వెళ్ళేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి రుణాలు మంజూరైనప్పటికి గృహనిర్మాణాలు మొదలు కాకపోవటంపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గృహాలు నిర్మించుకునేవారికి ఇసుక అవసరమైతే కూపన్స్ ఇవ్వాలని చెప్పారు. మండల, గ్రామసచివాలయాల స్థాయిలో సూక్ష్మప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, గృహ నిర్మాణ శాఖ పీడీ జె.ప్రసాద్, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేకాధికారులు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీలలో హైవెండ్ విద్యార్థుల ప్రతిభ

కర్లపాలెం, ఆగస్టు 13 : కర్లపాలెంలోని హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన కె.హేమభాగ్యశ్రీ, ఎం.నరసింహారెడ్డి, కె.శివఅంజిరెడ్డి, ఆర్.చరణ్‌సుందర్‌లు 7వ ఆంధ్రప్రదేశ్ జిల్లాల సబ్ జూనియర్ పోటీలలో ఈనెల 10, 11వ తేదీన కుప్పంలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొని విశేష ప్రతిభను కనబరిచారు. వీరికి రాష్ట్ర కార్యదర్శి చేతులమీదగా ప్రశంసపత్రాలను అందజేశారు. రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులను మంగళవారం హైవెండ్ హైస్కూల్‌లో యాజమాన్యం ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఉదయచంద్రరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాయిమహేంద్రబాబు, డైరెక్టర్ పెదమల్లు చాందిని, అకడమిక్ ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న, పీఈటీ గోపిరాజు, నెహ పాల్గొన్నారు.



పోటీలలో పాల్గొన్న హైవెండ్ విద్యార్థులతో డైరెక్టర్ చాంధిని, అకడమిక్ ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న

మండల పరిషత్ పాఠశాల తనిఖీ

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 13 : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ లలితకుమారి మంగళవారం తనిఖీ చేశారు. మండల పరిధిలోని ఆళ్లమూడిలోని ఎంపీపీ పాఠశాలను ఇన్‌చార్జి ఎంపీడీవో ఊహారాణితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించడంతో పాటు తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను విద్యాబోధనపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉదయభాస్కరి, హెచ్‌ఎం పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

17న ఆలయ భూములకు కౌలు వేలం

కొల్లూరు, ఆగస్టు 13 : ఆలయ భూములకు ఈ నెల 17వ తేదీన కౌలు వేలం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి దీవి అప్పలాచార్య మంగళవారం తెలిపారు. పోతార్లంక గ్రామంలో మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి సంబంధించిన మెట్ట భూమి య.5.65 సెంట్లుకు మూడు సంవత్సరాల కాల పరిమితితో బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే రైతులు రూ.5 వేలు దారావత్తు కింద చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

వేమూరు ఎస్‌ఐగా రవికృష్ణ

వేమూరు, ఆగస్టు 13 : వేమూరు ఎస్‌ఐగా జి.రవికృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల వీఆర్ నుంచి వేమూరుకు బదిలీ అయిన ఆయనకు స్టేషన్ సిబ్బందికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేఖర్లతో మాట్లాడుతూ మండల పరిధి గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘీక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదన్నారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించే వారిని శిక్షించడం జరుగుతుందని అన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ సీజ్

బాపట్లరూరల్, ఆగస్టు 13 : బాపట్ల మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను బాపట్లరూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా రూరల్ సీఐ కె.గంగాధరరావు మాట్లాడుతూ బాపట్ల మండలం మచ్చావారిపాలెం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకోవటం జరిగిందని వారిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను ఉన్నత రెవెన్యూఅధికారులకు రెఫర్ చేయటం జరిగిందని తెలిపారు. ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణ జరిపితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

పీసీ షెడ్‌లపై అవగాహన సదస్సు

కర్లపాలెం, ఆగస్టు 13 : ప్రతిగ్రామంలో పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం, గ్రామాభివృద్ధి ప్రణాళికలు, వీధిదీపాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని బాపట్ల శిక్షణా కేంద్రం ట్రైనింగ్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. పారిశుధ్యం, గ్రామాభివృద్ధి ప్రణాళికలు తదితర అంశాలపై దమ్మనవారిపాలెం సర్పంచ్ గుర్రపుసాల వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. సెర్ప్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి చింతకాయల పార్థసారథి పాల్గొని వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ ఏలీషాబాబు, మాజీ ఎంపీపీ తాతా లీలా వరప్రసాదరావు, మూడు మండలాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండో రోజు పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు శిక్షణ

పిట్టలవానిపాలెం ఆగస్టు 13: పిట్టలవానిపాలెం ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో రెండో రోజు మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని ఈవోపీఆర్డీ కె.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలను సూపరింటెండెంట్ బి.మధుసూదనరెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 13 : భట్టిప్రోలు అద్దేపల్లికి చెందిన గొరిపర్తి అర్జునరావు (46) రెండు రోజుల క్రితం తెనాలి వెళుతుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తెనాలి ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



నాగేంద్ర ప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సీనియర్ కార్యకర్తకు ఎమ్మెల్యే నివాళి

కొల్లూరు, ఆగస్టు 13 : టీడీపీ సీనియర్ కార్యకర్త తాతినేని నాగేంద్రప్రసాద్ మృతదేహానికి మంగళవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుని కుమారుడు యువ కార్యకర్త మోహన్‌ను ఓదార్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

రేపల్లె, ఆగస్టు, 13 : గ్రామాల్లో వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషి చేయాలని ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని పేటేరు గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు రీఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం రెండోరోజు సందర్భంగా చెత్త నుంచి సంపద తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం, ఘనవ్యర్థాలు నిర్వహణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. చెత్త సేకరణ పొడి, తడిచెత్త వేరుచేయుట వర్మీ కంపోస్టు తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



పేటేరులో సర్పంచ్‌లకు సూచనలు ఇస్తున్న ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు

మండల అభివృద్ధి అధికారిగా సుగుణమ్మ

చుండూరు, ఆగస్టు 13 : మండల అభివృద్ధి అధికారిగా టి.సుగుణమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన బదిలీల్లో భాగంగా ఆమె ప్రకాశం జిల్లా కొనకమెట్ల మండల అభివృద్ధి అధికారిణిగా బదిలీ అయ్యారు. ప్రభుత్వం తిరిగి వారిని యధాస్థానానికి బదిలీ చేయడంతో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు మండల ఉద్యోగులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన మారుతిశేషమాంబ

పిట్టలవానిపాలెం, ఆగస్టు 13 : సాధారణ ఎన్నికలలో భాగంగా కృష్ణా జిల్లా ఘంటసాల మండలానికి బదిలీపై వెళ్ళిన పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి భవనం మారుతిశేషమాంబ మంగళవారం తిరిగి పిట్టలవానిపాలెంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన ఎంపీడీవో ఎంటీవీ రమణమూర్తి ప్రకాశం జిల్లా కొండేపి మండలానికి బదిలీపై వెళ్ళారు.

సాగునీరు అందించాలని ఏఈని కోరిన రైతులు

చెరుకుపల్లి, ఆగస్టు 13 : వరదనీటిని సముద్రపాలు చేస్తున్నారేగాని కాల్వ చివర భూములకు సాగునీరు అందించాలనే ఉద్దేశ్యం ఏమైనా ఉందా అంటూ నీటిపారుదల శాఖ ఏఈ రవీంద్రబాబును మండలంలోని గూడవల్లి, నడింపల్లి రైతులు ప్రశ్నించారు. ఆగస్టు నెల సగం గడిచినా గంగయ్య ఛానల్ పరిధిలో సాగునీరు అందక భూములను దుక్కిదున్నలేదని వాపోయారు. సాగునీరు అందించకుండా ఉంటే జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. ఏఈ మాట్లాడుతూ కాల్వకు తగినంత నీటిని విడుదల చేశామన్నారు. దిగువన అమృతలూరు పరిధిలో రైతులు కాల్వ నీటిని అధికంగా వాడుకుంటున్నారని, దిగువకు నీరు తక్కువగా వస్తుందన్నారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు గోగినేని రామాంజనేయులు, మల్లాది శ్రీను, కొడాలి తల్పసాయి, ఘంటసాయి, కొడాలి రంగయ్య, ఘుమని కృష్ణ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థులకు బహుమతులు

చెరుకుపల్లి, ఆగస్టు 13 : జిల్లా సోషల్ టీచర్ల ఫోరం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా క్విజ్ పోటీలకు బహుమతులను గూడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.కవిత మంగళవారం అందించారు. చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీమ్ ప్రథమస్థానంలో నిలవగా నూరేపల్లి ఎయిడెడ్ పాఠశాల ద్వితీయస్థానం, పెసర్లంక జడ్పీటీ హెచ్‌ఎస్‌ఎం తృతీయస్థానంలో నిలిచాయన్నారు. ప్రోత్సాహక బహుమతులను నిజాంపట్నం జడ్పీహెచ్‌ఎస్ భట్టిప్రోలు విశ్వశాంతి హైస్కూలు నరసాయపాలెం అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘీక శాస్త్ర ఫోరం అసోసియేట్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్, ఉపాధ్యాయులు కె.లక్ష్మీనారాయణ, కె.శ్రీనివాస్‌శర్మ, బి.వెంకటేశ్వరరావు, బి.రామారావు, పార్థసారథి, వాకా శ్రీనివాసరావు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వినతులు సత్వరమే పరిష్కరించాలి : ఆర్డీవో

రేపల్లె, ఆగస్టు 13 : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, అన్ని శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విజయవంతం అయ్యేలా కృషి చేయాలని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో రెవెన్యూ సదస్సులపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వినతులపై స్పందించి ఆయా శాఖల అధికారులు సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాలుగు మండలాల తహసీల్దార్‌లు, వ్యవసాయ శాఖ ఏడీఈ విజయబాబు, దేవదాయశాఖ ఈవోలు మేకా సాంబశివరావు, దివి వెంకట అప్పలాచార్యులు, రాజేశ్వరరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హేలా షారోన్

● వేమూరు, ఆగస్టు 13 : రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించే సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ సుశీల అన్నారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాల్లో మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సుల నిర్వహణ నిమిత్తంగా అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ యజమానులు ఆయా సమస్యలను అర్జీ రూపంలో అందించాలని తెలిపారు. నీటి తీరువా బకాయిల వసూలుపై ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో మండల వ్యవసాయశాఖ అధికారి సునీత, ఈవోపీఆర్డీ శేఖర్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, ఇతర శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

● చుండూరు, ఆగస్టు 13 : మండల పరిధి రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించనున్న రెవెన్యూ గ్రామసభల ప్రయోజనాన్ని భూ యజమానులకు తెలియపరచాలని తహసీల్దార్ మల్లికార్జునరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న భూముల పరిష్కారానికి గ్రామసభలు ఉపయోగపడతాయన్నారు. సమావేశంలో ఆర్‌ఐ కిషోర్‌ప్రభు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నగరం, ఆగస్టు 13 : రైతులకు భూహక్కులను పరిరక్షించటంలో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉంటుందని నగరం మండలం తహసీల్దార్ ఎం.సత్యనారాయణ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతు సదస్సులో వచ్చే సమస్యలను 45 రోజుల్లో పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎ.రమేష్‌బాబు, టి.చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో సచివాలయం ఉద్యోగులు

● హాజరు నియంత్రణ నిల్ ● కొరవడిన పర్యవేక్షణ

వేమూరు, ఆగస్టు 13 : ఇటీవల కాలంలో సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో సంబంధిత ఉద్యోగులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. చాలా మంది ఉద్యోగులు సమయానికి కార్యాలయాలకు రాకపోవడం, మరికొందరైతే పూర్తిగా హాజరుకాకపోవడం జరుగుతోంది. ఆయా గ్రామాల శివారులలో బయోమెట్రిక్ పని చేయడం వల్ల ఊరి బయట బయోమెట్రిక్ హాజరు వేసి కొందరు కార్యాలయానికి రాకుండానే తిరుగువెళుతున్నట్లు సమాచారం. పించన్లు అందజేసే రెండు రోజులు మాత్రం తప్పనిసరిగా హాజరవుతున్నారు. ఆ తరువాత ఎప్పుడు ఎవరు వస్తున్నారు, ఎప్పుడు ఎవరు వెళుతున్నారు అనే విషయం గుర్తించే అధికారులే లేకపోయారు. దీంతో తమ అవసరాలు నిమిత్తంగా సచివాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల స్థాయిలోని అధికారులు పూర్తి పర్యవేక్షణతో సచివాలయాల పని తీరును మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.



కుచ్చెళ్ళపాడులో ఉదయం 11గంటలకు కూడా తెరుచుకొని సచివాలయం

పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

చెరుకుపల్లి, ఆగస్టు 13 : పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ అన్నారు. కావూరులో మంగళవారం ఆయన పర్యటించారు. కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన బడిలో సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వినయాశ్రమంలో ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించిన ఆయన ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు రాత్రి వేళ చదువుకునేందుకు షెడ్ అవసరముందని, ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న కాంటాక్టు ఉద్యోగులు, సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలంటూ ఆయనకు వినతిపత్రం అందించారు. పాఠశాలలోని సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వనజాక్షి, లక్ష్మీ, టీడీపీ నేతలు మండవ తాతాజీ, కేసన రామకృష్ణ, తాతా ఏడుకొండలు, సుఖవాసి వాసు తదితరులు పాల్గొన్నారు.



శివప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు

విద్యార్థులు మత్తుకు బానిసకాకూడదు : ప్రిన్సిపల్

రేపల్లె, ఆగస్టు 13 : తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా విద్యలో రాణించి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అవరోధించాలని ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టిసి రవిచంద్రకుమార్ అన్నారు. ఏబీఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులచే నిషాముక్తభారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం పట్టణంలో ర్యాలీ, మానవహారం నిర్వహించి మత్తు పదార్థాల వినియోగం వలన తలెత్తే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలైన గంజాయి, సారాయి, కొకైన్‌లను వినియోగిస్తే ఆరోగ్యానికి హానికలుగుతుందని, ఆర్థికంగా కుటుంబాలు చితికిపోతాయని తెలిపారు. విద్యార్థులు మత్తుకు బానిసకాకుండా విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ కె.బాలగురవయ్య, అధ్యాపకులు భీమయ్య, మండపాటి దాసు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు అరుదైన ఆహ్వానం


నాగమణి

బల్లికురవ, ఆగస్టు 13 : స్వాతంత్ర వేడుకల్లో పాల్గొనాలని ఢిల్లీ నుంచి బల్లికురవ మండలం కొత్తమల్లాయపాలెం అంగన్‌వాడీ కార్యకర్త జీ నాగమణికి ఆహ్వానం అందింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల నుంచి ఐదుగురు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆగస్టు 15న జరగనున్న వేడుకలలో పాల్గొనాలని ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. బాపట్ల జిల్లా సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు తరపున కొత్త మల్లాయపాలెం అంగన్‌వాడీ కార్యకర్త విధుల్లో తనవంతు విశేష కృషి చేస్తుండడంతో ప్రభుత్వం గుర్తించి ఈ అవకాశం ఇచ్చింది. పోషణ్ స్కీం అమలులో బాధ్యతగా పనిచేసిన అయిదుగురికి ఆహ్వానం లభించింది. అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిని ప్రాజెక్టు సీడీపీవో సుధ, సూపర్‌వైజర్లు విజయనిర్మల, సహచర కార్యకర్తలు అభినందించారు.

నేటి నుంచి శ్రీశైలానికి అదనపు బస్సు

4 మండలాల ప్రయాణికులకు సౌకర్యం

అద్దంకి, ఆగస్టు 13 : అద్దంకి నుంచి శ్రీశైలంకు బుధవారం నుంచి అదనంగా బస్ సర్వీసును నడుపనున్నట్లు డీఎం బెల్లం రామ్మోహనరావు తెలిపారు. అద్దంకి, ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి మండలాలలోని పలు గ్రామాల ప్రజలు నేరుగా శ్రీశైలం వెళ్లేందుకు బస్ సర్వీసును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అద్దంకిలో ఉదయం 6-30 గంటలకు బయలుదేరి ముండ్లమూరు, తాళ్లూరు, తూర్పుగంగవరం, బొద్దికూరపాడు, రాజంపల్లి మీదుగా పొదిలికి 8-50 గంటలకు చేరుతుందన్నారు. అక్కడ 9-15కి బయలుదేరి మార్కాపురం మీదుగా మధ్యాహ్నం 1 గంటకు శ్రీశైలం చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో శ్రీశైలంలో మధ్యాహ్నం 2-15 గంటలకు బయలుదేరి పొదిలి 6-15 గంటలకు చేరుతుందన్నారు. అక్కడ నుంచి 6-30 గంటలకు బయలుదేరి రాజంపల్లి, బొద్దికూరపాడు, తూర్పుగంగవరం, తాళ్లూరు, ముండ్లమూరు మీదుగా రాత్రి 9 గంటలకు అద్దంకికి చేరుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం రామ్మోహనరావు కోరారు.

సింథైట్ ఫ్యాక్టరీ పరిశీలన


ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి

మేదరమెట్ల, ఆగస్టు 13 : మేదరమెట్లలోని సింథైట్ ఫ్యాక్టరీని జాయింట్ కలెక్టర్ బీ సుబ్బారావు ఆదేశాల మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. మంగళవారం మేదరమెట్లలో సింథైట్ ఫ్యాక్టరీకి వచ్చిన రాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డితో కలిసి ఫ్యాక్టరీలోని వివిధ విభాగాలను పరిశీలించారు. మిరపకాయలను పొడి చేసే విభాగాన్ని పరిశీలించి కోరు రాకుండా కొత్తగా అక్కడ చేస్తున్న పనులను పరిశీలించారు. బాయిలర్ విభాగానికి కూడా ఆయన అధికారులతో వెళ్లారు. ఫ్యాక్టరీని ఆపివేసి కోరు రాకుండా చేస్తున్న పనులను ఫ్యాక్టరీ ప్రతినిధులు వారికి వివరించారు. పరిసరాల్లో 200 చెట్లు నాటాలని నిర్ణయించారు. ఆర్ఐ పోతురాజు, వీఆర్వో రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు వసతులు కల్పించకుంటే చర్యలు

చట్టాలపై అవగాహన ఉండాలి : న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

బల్లికురవ కస్తూర్బాలో ఆకస్మిక తనిఖీ


పాఠశాలను తనిఖీ చేస్తున్న న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

బల్లికురవ, ఆగస్టు 13 : విద్యార్థినులకు అన్ని రకాల వసతులు కల్పించకుంటే చర్యలు తప్పవని అద్దంకి కోర్టు న్యాయాధికారి డీ నాగవెంకటలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం రాత్రి బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని న్యాయమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని అన్ని గదులను పరిశీలించారు. వసతులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని గదులలో సరైన వెలుతురు లేదని, వారి సామగ్రి ఉంచేందుకు సరిపడా కప్ బోర్డులు లేవని, వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడాన్ని చూసి స్వీపర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం భోజనశాలను, భోజనాన్ని, కూరగాయలు నిల్వ చేసే గదిని పరిశీలించి నాణ్యమైన సరుకులు తెప్పించాలని సూచించారు. జనరేటర్ సౌకర్యం కల్పించాల్సిందిగా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. బాల్య వివాహాలు చేస్తే వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరళకుమారి, న్యాయవాదులు మార్తా శ్రీను, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.


స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్


స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 13: ఒంగోలులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. మంగళవారం సాయంత్రం ఎస్పీ ఎఆర్.దామోదర్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీట్ల కేటాయింపుతోపాటు వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జెండా ఆవిష్కరణతోపాటు మంత్రి డాక్టర్ స్వామి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించే ఏర్పాట్లపై చర్చించారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో స్టాల్స్‌తోపాటు శకటాల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్వో విశ్వేశ్వరరావు, ఏఎస్పీ నాగేశ్వరరావుతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ఒరిగిన స్కూల్ బస్సు

విద్యార్థులకు తప్పిన ప్రమాదం


అదుపుతప్పి ఒరిగిన స్కూల్ బస్సు

పామూరు, ఆగస్టు 13: మండలంలోని తూర్పుకట్టకిందపల్లి వద్ద మంగళవారం స్కూల్ బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి ఒక వైపునకు ఒరిగింది. విద్యార్థులు క్షేమంగా బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు. పామూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు కట్టకిందపల్లి నుంచి సుమారుగా 40మంది విద్యార్థులతో వస్తుంది. ఈక్రమంలో అదుపుతప్పి గ్రామ పంట పొలాల్లోకి దూసుకెళ్లి ఓ వైపునకు ఒరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.

ఉపాధిలో అనకొండ

ప్రహసనంలా సోషల్ ఆడిట్
వైసీపీ పాలనలో శీనారెడ్డి ఇచ్చిందే తీర్పు
నాలుగున్నరేళ్ల పాటు పీడీగా ఇష్టారాజ్యం
రూ.300 కోట్లపైనే నిధులు పక్కదారి
పంచుకుతిన్న సిబ్బంది, నాయకులు
పరిశీలనల్లో ఆడిట్ బృందాలు గుర్తింపు
ప్రజావేదికల్లో పది శాతానికి పీడీ కోత
ఆపై వ్యక్తిగత విచారణ అంటూ అవి కూడా రద్దు
చర్యలు, రికవరీలు శూన్యం.. ఫలితం రూ.కోట్లు స్వాహా
సిబ్బంది బదిలీలు, నియామకాల్లో అక్రమాలు, వసూళ్లు
ఉన్నతాధికారులకు భారీగా ఫిర్యాదులు, కొన్నింటిపైనే విచారణలు

ఒంగోలు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో ఆ పార్టీతో అంటకాగిన అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అందిన కాడికి వారు, వారికి వత్తాసు పలికే వారు పంచుకుతిన్నారు. అలాంటి ప్రభుత్వ శాఖల్లో జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఒకటి కాగా వైసీపీ పాలనలో నాలుగున్నరేళ్ల ఆ సంస్థ పీడీగా పనిచేసిన కే.శీనారెడ్డి ఇష్టారాజ్యాంగ వ్యవహరించాడన్న ఆరోపణలు సర్వత్రా ఉన్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత ఆయనపై ఉన్నతాధికారులకు, పాలకపక్ష పెద్దలకు భారీగా ఫిర్యాదులు అందడం, వాటిల్లోకొన్నింటిపై విచారణకు కూడా ఆదేశించడం ఆ ఆరోపణలకు ఊతం ఇస్తున్నది. ప్రత్యేకించి ఉపాధి పథకం పారదర్శకంగా సాగేలా చేసేందుకు కేంద్రప్రభుత్వం చట్టంలో చేసిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలు (సోషల్ ఆడిట్) జిల్లాలో పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో ప్రహసనంలా సాగింది.

సగానికి సగం నిధులు స్వాహా

జిల్లాలో వైసీపీ ప్రభుత్వ పాలనలో 2019-24 వరకు రూ.3,383 కోట్ల మేర ఉపాధి పథకంలో ఖర్చుచేశారు. అందులో కూలీలకు వేతన రూపంలో రూ.2,110 కోట్లు, మెటీరియల్ రూపంలో మరో రూ.1,273 కోట్లు వ్యయం చేశారు. సాధారణంగా కనీసం 20శాతం నిధులు స్వాహా అన్నది ఆ పథకంలో సర్వసాధారణమే. వైసీపీ పాలనలో అంతకన్నా అధికంగానే స్వాహా జరిగింది. ఒక్క జగనన్న కాలనీల పేరుతో జిల్లాలో ఉపాధి నిధులు రూ.150కోట్ల మేర ఖర్చుచేయగా అందులో సగానికి సగం వైసీపీ నేతలు, డ్వామా సిబ్బంది తిన్నారనేది బహిరంగసత్యం. పలు మండలాల్లో కూలీలు రాకుండానే వచ్చినట్లు, అసలు గ్రామంలో లేకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల్లోనూ ఉండేవారి పేర్లతోనూ మస్టర్లు వేసి పంచుకుతిన్నారు. అలాంటి అక్రమాలను అరికట్టేందుకు ఏడాదికి రెండుసార్లు సోషల్ ఆడిట్ బృందాలు మండలం యూనిట్‌గా తనిఖీలు చేయడం వారు గుర్తించిన అక్రమాలపై మండలకేంద్రంలో ప్రజావేదిక నిర్వహించి బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేసే వారు. అవకతవకలు, అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించిన సిబ్బందిపై వేటు వేయడంతోపాటు రికవరీకి ఆదేశించేవారు. కొందరిని ఉద్యోగాల నుంచి తొలగించి వేసేవారు.

అక్రమార్కులకు ఒత్తాసు పలికి..

గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సోషల్ ఆడిట్ పకడ్బందీగా సాగేది. ఒక్కొక్క మండలంలో రెండు, మూడు రోజులు కూడా సామాజికవేదిక సభలు సాగేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ విధానం ప్రహసనంలా సాగిపోయింది. పకడ్బందీగా ప్రక్రియను కొనసాగేలా సహకరించి సిబ్బంది అక్రమాలను నియంత్రించాల్సిన డ్వామా పీడీ హోదాలో ఉన్న శీనారెడ్డే అవినీతికి గేట్లు ఎత్తారన్న ఆరోపణలు ఉన్నాయి.


ఉపాధి పనులను చేస్తున్న కూలీలు(ఫైల్)

క్షేత్రస్థాయిలో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలు, సిబ్బందికి సహకరించేలా బూటకపు ప్రజావేదికలను నడిపాడన్న విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. అంతకుముందు ఒక్కొక్క మండలంలో రెండేసి రోజులు ప్రజావేదిక సభలు జరపాల్సి ఉండగా శీనారెడ్డి హయాంలో రోజుకు రెండేసి మండలాల్లో నిర్వహించి మమ అనిపించేవారు. ఇక వైసీపీ పాలన ఐదేళ్ల కాలంలో రూ.3,383 కోట్ల మేర పనులు జరగ్గా కనీసం పదిశాతం వంతున దుర్వినియోగం అనుకున్నా రూ.300 కోట్లపైనే పక్కదారి పట్టినట్లు ఆడిట్ బృందాలు గుర్తించాయి. అయితే సామాజిక తనిఖీల అనంతరం మండలస్థాయిలో జరిగే ప్రజావేదిక సభల్లో ఐదేళ్లలో కేవలం రూ.39.22 కోట్లు మాత్రమే దుర్వినియోగం జరిగినట్లు పీడీ తేల్చాడు.

> జిల్లాలో కీలకమైన ఉపాధి హామీ పథకంలో వందల కోట్ల నిధులు పక్కదారి పట్టడం, సిబ్బంది, వైసీపీ క్షేత్రస్థాయి నేతలు పంచుకుని తినడం బహిరంగ సత్యం. వాటిలో కొన్నింటిని సోషల్ ఆడిట్ బృందాలు తమ తనిఖీల్లో గుర్తించాయి. అయితే జిల్లాలో ఉపాధి పనులు పర్యవేక్షించే అధికారి డ్వామా పీడీ. ఆడిట్ బృందాల అభ్యంతరాలపై మండలస్థాయిలో జరిగే విచారణ జరిగే ప్రజావేదిక సభలో విచారణాధికారిగా పాల్గొని పీడీ శీనారెడ్డి తన చేతివాటం చూపేవారు. అక్కడే ఆడిట్ బృందం అక్రమాలుగా రాసిన మొత్తాన్ని ఇంచుమించు పదిశాతానికి తగ్గించడం, ఆపై వ్యక్తిగత విచారణ పేరుతో సిబ్బందిని పిలిచి ఆ కొద్దిమొత్తాలను కూడా తొలగించి వేశారు. తద్వారా వందలకోట్ల ఉపాధి నిధులు దుర్వినియోగం జరిగినా సిబ్బందిపై నామమాత్రపు చర్యలతో సరిపెట్టారు. రికవరీలు లేకుండా చేయడం చేసి తద్వారా భారీగా తాను లబ్ధిపొందాడన్నా చర్చ ఆ శాఖ వర్గాల్లో నేటికీ నడుస్తోంది.

ఆయన చెప్పిందే తీర్పులాగా ప్రజావేదిక సభలు కొనసాగాయి.ఇక ఆపై ఆ సభల్లో బాధ్యులుగా గుర్తించిన సిబ్బందిని వ్యక్తిగత విచారణ పేరుతో డ్వామా కార్యాలయానికి పిలిచి అక్కడ వారిపై ప్రజావేదిక సభలో నమోదు చేసిన మొత్తాన్ని పదిశాతంకు తగ్గించి వేయడం, చర్యలు లేకుండా తిరిగి కొనసాగించడం జరిగిపోయాయి.

రూ.కోటికి తగ్గించేశారు..

ఐదేళ్ల కాలానికి సంబంధించి ప్రజావేదికల్లో దుర్వినియోగంగా గుర్తించిన రూ.39.22 కోట్లను వ్యక్తిగత విచారణ అనంతరం ఆ మొత్తాన్ని కోటికి పీడీ తగ్గించి వేసినట్లు సమాచారం. వైసీపీ అధికారంలోకి వచ్చిన 2019-20లో రూ.695 కోట్ల మేర ఉపాధి నిధులు వ్యయం జరిగాయి. అందులో రూ.50.67 కోట్లు మేర దుర్వినియోగమైనట్లు సోషల్ ఆడిట్ బృందాలు గుర్తించినట్లు సమాచారం. అయితే ప్రజావేదికల్లో ఆ మొత్తాన్ని రూ.7.84 కోట్లకు వ్యక్తిగత విచారణ సమయంలో చివరకు రూ.10 లక్షలకు తగ్గించి వేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితే ఏటా కొనసాగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు ఇతర విషయాలలో ప్రత్యేకించి వివిధ స్థాయిల్లోని డ్వామా సిబ్బంది బదిలీలు, సస్పెన్షన్లు ఎత్తివేత, పోస్టింగులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు తదితర అంశాలలో నాటి పీడీ శీనారెడ్డి అప్పటి అధికార వైసీపీ ప్రభుత్వంలో ఉన్న పలుకుబడితో ఇష్టారాజ్యాంగా వ్యవహరించి అక్రమాలకు పాల్పడినట్లు సర్వత్రా చర్చ సాగుతోంది. ఇవే విషయాలతో ప్రస్తుతం కొందరు డ్వామా సిబ్బంది అటు గ్రామాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు ఇటు కలెక్టర్ ఇతర పాలకపక్ష పెద్దలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. తదనుగుణంగా ప్రస్తుతం విచారణలు జరుగుతుండగా మరికొందరు ఇంకొన్ని ఆధారాలతో ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

బిల్లు.. ఘొల్లు!

లైన్‌ఇన్‌స్పెక్టర్ ఇంటికి రూ.1.20లక్షల కరెంటు బిల్లు
ఒక నెలలోనే 12,600 యూనిట్లు వినియోగించినట్లు రీడింగ్
మూడేళ్లుగా అధికారుల చుట్టూప్రదక్షిణలు
అయినా పట్టించుకోని వైనం
విద్యుత్ అదాలత్‌లో గోడువెళ్లబోసుకున్న వెంకటస్వామి
సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వని అధికారులు


అధికారుల ముందు గోడు వెళ్లబోసుకుంటున్న వెంకటస్వామి

మర్రిపూడి, ఆగస్టు 13 : విద్యుత్ ఉద్యోగికే ఆశాఖ అధికారులు షాక్ ఇచ్చారు. ఆయన ఇంటికి ఒక నెలలో రూ.1.20లక్షల బిల్లు వేశారు. తాను ఆ ఇంటిలో ఉండటం లేదని, ఎప్పుడో ఒకసారి వచ్చి వెళ్తుంటానని ఆ ఉద్యోగి మొత్తుకున్నా వినిపించుకోకుండా రూ.40వేలు వసూలు చేశారు. విచారించి న్యాయం చేయాలని ఆయన అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా మూడేళ్లుగా పట్టించుకోలేదు. దీంతో మంగళవారం కొండపిలో నిర్వహించిన విద్యుత్ అదాలత్‌కు సింగరాయకొండ మండలం కలికివాయికి చెంది ప్రస్తుతం కె.ఉప్పలపాడు సబ్‌స్టేషన్‌లో లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న హాజరై గోడువెళ్లబోసుకున్నారు. ఆయన కథనం మేరకు.. కలికివాయిలో వెంకటస్వామికి సొంత ఇల్లు ఉంది. ఆయన పలు మండలాల్లో ఉద్యోగం చేస్తూ ఎప్పుడో పండుగలకు, పబ్బాలకు సొంత ఊరికి వెళ్తుంటారు. ఒకట్రెండ్రోజులు ఉండి వెళ్లిపోతుంటారు. తాను సొంతూరికి వచ్చినప్పుడు ఇబ్బంది లేకుండా ఉండాలన్న ఉద్దేశంతో దాన్ని బాడుగకు కూడా ఇవ్వలేదు. తన ఇంటికి మినిమం బిల్లు వస్తుండగా అది నెలనెలా చెల్లిస్తున్నాడు. అటువంటి ఇంటికి 2021 ఏప్రిల్‌లో ఒక్కసారిగా 12,600 యూనిట్లు విద్యుత్ వినియోగించినట్లు, అందుకు 1,20,000 చెల్లించాలని విద్యుత్ బిల్లు వచ్చింది. దీంతో విస్తుపోయిన ఆయన తన శాఖలోని సంబంధిత అధికారుల చుట్టూ తిరిగారు. క్షేత్రస్థాయిలో తన ఇంటిని పరిశీలించాలని, పూర్వపు బిల్లులను చూడాలని, చుట్టు పక్కల వారి నుంచి తన ఇంటిలో ఎవరైనా ఉంటారా? లేదా? అన్న విషయమై విచారించాలని అధికారులను అప్పటి నుంచి వెంకటస్వామి వేడుకుంటున్నా పట్టించుకోలేదు. సాంకేతికంగా జరిగిన పొరపాట్లను శాఖ సరిచేసే వరకూ వినియోగదారుడు కొత్త మీటర్‌కు దరఖాస్తు చేసుకుంటే ఇస్తారు. అలాగే వెంకటస్వామి కూడా కొత్త మీటర్ పొందారు. దాన్ని కూడా నాలుగు నెలల్లోనే తొలగించారు. అప్పటి అధికారులు కేవలం పంతంతో.. వచ్చిన బిల్లు కట్టాల్సిందేనని పదేపదే తనను వెంటాడారని వెంకటస్వామి అదాలత్‌లో వాపోయారు. రీడింగ్‌లో తప్పు వల్ల జరిగిన దానికి తనకు వచ్చిన 1,20,000 లక్షల బిల్లులో రూ.40 వేలు వసూలు చేశారని అధికారుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా తనకు వన్‌టైం సెటిల్మెంట్‌గా కొంత తగ్గించి చెబితే బిల్లు కట్టేస్తానని, తన ఇంటికి విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు. అయితే అధికారులు వెంకటస్వామి చెప్పిన విషయాలు విని తలలు ఊపి వెళ్లిపోయారు. ఆయనకు ఎలాంటి హామీ ఇవ్వలేదు. సామాన్య ప్రజలకు న్యాయం చేస్తున్న అధికారులు తనను విద్యుత్ వినియోగదారుడిగానైనా గుర్తించి న్యాయం చేయాలని వెంకటస్వామి కోరారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ


మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడీ

సంతమాగులూరు, ఆగస్టు 13 : సంతమాగులూరు పోలీస్‌స్టేషన్ ను ఎస్పీ తుషార్ డూడీ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం ఎస్పీ రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ మల్లికార్జున, సంతమాగులూరు సీఐ కె.వెంకటరావు పాల్గొన్నారు.

రేపు జిల్లాలో ఐదు అన్న క్యాంటీన్లు ప్రారంభం

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 13: పేదల ఆకలి తీర్చేందుకు తెలుగుదేశం పార్టీ కూటమి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రూ.5కే భోజనం 'అన్న' క్యాంటిన్లు గురువారం ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది. ఈ మేరకు తొలుతగా రాష్ట్రవ్యాప్తంగా 100 అన్న క్యాంటిన్లను ప్రారంభించనుంది. జిల్లాకు సంబంధించి ఒంగోలులో నాలుగు, చీమకుర్తిలో ఒకటి ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సహకారంతో ఒంగోలులో నాలుగు క్యాంటిన్లలో రెండు నెలలుగా ఉచితంగా పేదలకు అన్నం పెడుతున్నారు. ఆగస్టు 15 నుంచి ఒంగోలులో దామచర్ల వీటిని ప్రారంభించనున్నారు.

కేసులొస్తే.. కాసులే...!

ఏస్ఈబీ కార్యాలయంలో మామూళ్ల దోపిడీ
మద్యం పట్టుకోకుండా సెటిల్‌మెంట్లు
బెల్టుషాపులు, హోటల్స్ నుంచి నెలవారి ముడుపులు
ప్రతి కేసుకు ముక్కుపిండి వసూలు
ఎన్నికల రైడింగ్‌లో దొరికిన మద్యానికి రూ.10వేలకుపైగా వసూలు

పుల్లలచెరువు, ఆగస్టు 13: నియోజవర్గ స్థాయిలో మద్యాన్ని కంట్రోలు చేయాల్సిన ఓ అధికారికి కేసులు వస్తే కాసుల వర్షం కురుస్తోంది. ఎర్రగొండపాలెం కేంద్రంగా పనిచేస్తున్న సదరు అధికారి కాసులిస్తే కేసులు మాయం చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. నియోజకవర్గంలోని ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లో వేకువజాము నుంచే బ్లాక్‌లో మద్యం జోరుగా దొరుకుతోంది. అయినప్పటికీ, సదరు అధికారి పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మూడు మండలాల్లోని ప్రతి గ్రామంలో 3కిపైగా సుమారు 250 బెల్టుషాపులు ఉన్నాయి. సదరు అధికారి ప్రతి బెల్టుషాపు నుంచి రూ.5వేలు తీసుకొని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ఆ శాఖ ఉద్యోగులే గుసగుసలు ఆడుకుంటున్నారు. గ్రామాల్లోని బెల్టుషాపులతోపాటు చిన్న చిన్న హోటల్స్‌లో మద్యం అమ్ముకునేందుకు, ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం రెస్టారెంట్‌ల్లో మద్యం సేవించేందుకు వారి నుంచి భారీ మొత్తంలో నెలవారీ మామూళ్ల వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏదైనా మద్యం కేసు వస్తే ముందుగా అధికారి మధ్యవర్తుల ద్వారా బేరం కుదుర్చుకొని వారి నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. మామూళ్లు ముట్టజెప్పుకోలేని వారికి మాత్రమే కేసుల వేధింపులు ఉంటున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇరుపార్టీల నుంచి భారీమొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. మద్యం తీసుకెళ్తూ పట్టుబడిన ఇరుపార్టీల కార్యకర్తల నుంచి రూ.10 వేల నుంచి రూ.15వేలు వసూలు చేసి కేసులు లేకుండా చేశారు. ఎర్రగొండపాలెం పట్టణంలోని వైసీపీ ప్రజాప్రతినిధి ప్రభుత్వ దుకాణాల నుంచి మంచి బ్రాండ్‌ల మద్యం బ్లాక్‌కు తరలించి ప్రత్యేక వ్యక్తుల ద్వారా వేకువజాము నుంచి వైపాలెం పట్టణంలోని వినుకొండ రోడ్డు, పుల్లలచెరువు రోడ్డుల్లో జోరుగా విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలిసినా, సదరు అధికారి మాత్రం కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు దృష్టిసారించి ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అక్రమ మద్యానికి అడ్డుకట్ట వేసి ఆ అధికారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆగని వైసీపీ నేతల ఇసుక దందా

అనుమతులు లేకున్నా యథేచ్ఛగా తవ్వకాలు
లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
చోద్యం చూస్తున్న అధికారులు


గుండ్లకమ్మ వాగులో ఇసుక కోసం జరిపిన తవ్వకాలు

దొనకొండ, ఆగస్టు 13 : గత వైసీపీ ప్రభుత్వంలో ప్రకృతి సంపదను దోచుకోవడంపై ఆ పార్టీ నాయకులు తెగపోటీపడ్డారు. అడ్డూఅదుపులేకుండా ఇసుకను తవ్వుకుని అమ్ముకున్నారు. మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీకి చెందిన ఆ పార్టీ నాయకుల ఇసుక దందా అంతాఇంతా కాదు. ఈ దోపిడీపై అప్పట్లో పలువురు టీడీపీ నాయకులు పోరాడితే పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పించి కేసులు నమోదు చేయించి తీవ్రఇబ్బందులకు గురిచేశారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైసీపీ నాయకులకు అడ్డేలేకుండా పోయింది. కొచ్చెర్లకోట పంచాయతీ పరిధిలోని సిద్ధాయిపాలెం సమీపంలోని గుండ్లకమ్మ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దొనకొండ నుంచి సిద్ధాయిపాలెం మీదుగా మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారి నుంచి దాదాపు రెండు కిలోమీటర్లు లోపల సరైన రహదారి లేని ప్రదేశంలో ఈ ఇసుక రీచ్ ఉంది. అప్పట్లో ఈ ఇసుకకు పెద్దగా గిరాకీ లేకపోవటంతో తగిన గుర్తింపు లేకుండాపోయింది. ఇటీవల కాలంలో తవ్వేకొద్దీ నాణ్యమైన ఇసుక వస్తుండడంతో సిద్ధాయిపాలెం ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఇసుకను తోడి పరిసర ప్రాంతంలో డంపింగ్ చేస్తున్నారు. ఈ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా మార్కాపురం, దొనకొండ తదితర ప్రాంతాలకు తరలించి ట్రక్కు సుమారు రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు. సమీపంలో రూ.3 వేలకు విక్రయాలు చేస్తూ దర్జాగా సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి అక్రమార్కులపై తగిన చర్యలు చేపట్టి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.


నగదు అందిస్తున్న ఉప్పుగుండూరు వాసులు

గోమాతల మేతకు సాయం

ముందుకొస్తున్న దాతలు

అద్దంకి, ఆగస్టు 13 : అద్దంకిలోని హరిహర గోకులంలో ఆవుల మేతకు పలువురు దాతలు ముందుకు వచ్చి 33వేల రూపాయల నగదు అందజేశారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన గోమాతల ఆక్రందన అనే కథనానికి స్పందించిన ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన సింగు శ్రీనివాసరావు రూ.20 వేలు, జీఎస్ శర్మ, జీవీఆర్, బెల్లం సుబ్బారావు, సీతారామయ్య, అమరా వెంకటేశ్వరరావు, కిషోర్, పావులూరి సుబ్బారావు, తేలప్రోలు వెంకట శేషారావు రూ.13వేలను ఇవ్వగా ఆ మొత్తాన్ని మంగళవారం అద్దంకి వచ్చి గోశాల నిర్వాహకుడు సుబ్బారావుకు అందజేశారు. గోవులకు మేత, నగదు అందజేయాలనుకునే దాతలు 73825 06115 నెంబర్‌కు సంప్రదించాలని సుబ్బారావు కోరారు.

అభివృద్ధి .. అధికార మార్పిడి

నేడు మంత్రి గొట్టిపాటిని కలవనున్న మున్సిపల్ కౌన్సిలర్‌లు

అద్దంకి, ఆగస్టు 13 : అద్దంకి మున్సిపాలిటీలో పలువురు కౌన్సిలర్‌లు అందరూ ఒకే సారి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసేందుకు బుధవారం అమరావతి వెళ్లనున్నారు. టీడీపీకి చెందిన 7 గురు కౌన్సిలర్‌లతో పాటు ఎన్నికల ముందు టీడీపీలో చేరిన ఇద్దరు కౌన్సిలర్ మొత్తం 9 మంది కౌన్సిలర్‌లు బుధవారం మంత్రి రవికుమార్‌ను కలవనున్నారు. ఆయా వార్డులలో అభివృద్ధి పనుల గురించి మాట్లాడేందుకు వెళ్తున్నట్లు కౌన్సిలర్‌లు చెప్తున్నప్పటికీ అసలు విషయం వేరే ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆయా వార్డులలో తమ మాటకే ప్రాధాన్యత ఇచ్చే విధంగా అధికారులకు చెప్పాలని కోరనున్నట్లు తెలుస్తుంది. వాటన్నింటికంటే టీడీపీ కూటమి అధికారంలో ఉన్నందున అద్దంకి మున్సిపాలిటీ కూడా టీడీపీ పాగా వేసే విధంగా చేయాలని కోరనున్నట్లు సమాచారం. అద్దంకి మున్సిపాలిటీలో మొత్తం 20 మంది కౌన్సిలర్‌లు కాగా, ప్రస్తుతం టీడీపీ పక్షాన 9 మంది ఉన్నారు. మరో ఇద్దరు కౌన్సిలర్‌లు సంపూర్ణ మద్దతు తెలిపేందుకు సంసిద్ధంగా ఉన్నారు. దీంతో వైసీపీ కౌన్సిలర్‌ల బలం 9కి పడిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తమకున్న బలంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ల పదవులు కైవసం చేసుకోవాలని టీడీపీ కౌన్సిలర్ లు ఉవ్విల్లూరుతున్నారు. మంత్రి తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోరనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. అవిశ్వాసం పెట్టడానికి రాష్ట్ర స్థాయిలో విధాన పరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉండడంతో పాటు భవిష్యత్‌లో ఎదురయ్యే అడ్డంకులను కూడా బేరీజు వేసుకొని మంత్రి రవికుమార్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గొట్టిపాటిని కలిసిన సమయంలో కౌన్సిలర్‌లకు ఎలాంటి హామీ లభిస్తుందో వేచి చూడాల్సి ఉంది. అభివృద్ధి పనుల మాటున అధికార మార్పిడి కోసమే ఈ కలయిక అన్న సంకేతాలు విన్పిస్తున్నాయి.


అద్దంకి మున్సిపల్ కార్యాలయం


గోతులతో ఉన్న కొణిదెన రోడ్డుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కొణిదెన రోడ్డు బాగు

మార్టూరు ఎన్‌హెచ్-5 వరకు మరమ్మతులు

బల్లికురవ, ఆగస్టు 13 : నరకప్రాయంగా మారిన కొణిదెన రోడ్డుకు స్వల్ప ఉపశమనం కలుగుతుంది. ఈరోడ్డు పూర్తి స్థాయిలో వర్షాలతో దెబ్బతినండంతో గత డిసెంబరులో దెబ్బతిన్న రోడ్డుకు ప్యాచ్‌లు వేసేందుకు అర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపగా ఇప్పుడు నిధులు మంజూరు కావడంతో మంగళవారం నుంచి రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. బల్లికురవ నుంచి వయా కొణిదెన గ్రామాల మీదుగా ఎన్‌హెచ్ 5 వరకు ఉన్న అర్‌అండ్‌బీ రోడ్డు సుమారు 12 కిలోమటర్ల వరకు పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డులో మోకాటి లోతు గోతులు ఉండడంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత కొంత కాలం నుంచి ఈ రోడ్డులన ప్రయాణించే ప్రజలు రోడ్డు అభివృద్ధి పరచాలని గగ్గోలు పెడుతున్నారు. అధికారులు గతంలో పంపిన ప్రతిపాదనకు ఇప్పుడు రోడ్డు బాగా దెబ్బతినడంతో వచ్చిన నిధులతో కొంత వరకు పెద్ద పెద్ద గోతులను కొణిదెన గ్రామం నుంచి ఎన్‌హెచ్-5 వరకు ప్యాచ్ లు వేసేందుకు పనులు చేపడుతున్నారు. కొణిదెన నుంచి బల్లికురవ వరకు ప్యాచ్‌లు కూడా చేపట్టేందుకు నిధులు లేవు. ఈ రోడ్డును పూర్తి స్థాయిలో మరలా పగటగొట్టి వెట్ మిక్స్ వేసి అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుతున్నారు. అర్‌అండ్‌బీ అధికారులు కూడా రోడ్డును పరిశీలించి రోడ్డు బాగా దెబ్బతిందని వెంటనే నిధులు మంజూరు చేయించేలా ఉన్నతాధికారులకు నివేదికను పంపుతున్నారు. ప్యాచ్ వర్క్ పనులు చేపట్టిన ఉపయెగం లేదని రోడ్డు మెత్తం అధ్వానంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే దెబ్బతిన్న రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు.


సంధ్యారాణి, పవన్ గోపీకృష్ణ, హితేంద్ర

కొండమంజులూరు విద్యార్థుల ప్రతిభ

పంగులూరు, ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బాపట్లలో విద్యాశాఖ నిర్వహించిన వక్తృత్వ, క్విజ్ పోటీలలో కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథములుగా నిలిచారు. జీవవైవిధ్య పరిరక్షణలో యువత పాత్ర అనే అంశంపై జరిగిన వక్తృత్వ పోటీలో పాల్గొన్న కొండమంజులూరు ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని యల్లంకి సంధ్యారాణి ప్రతిభ కనబరిచి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు చాతరాజుపల్లి పవన్ గోపీకృష్ణ, పంచుమర్తి హితేంద్ర క్విజ్ పోటీలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థులకు ఈనెల 15న జరిగే స్వాతంత్ర్య వేడుకలో కలెక్టర్ ప్రశంసాపత్రం, నగదు బహుమతులను అందజేస్తారని హెచ్‌ఎం ఐ.అనిత తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో సత్తాచాటి పాఠశాలకు పేరు తెచ్చిన విద్యార్థులను ఎస్‌ఎంసీ చైర్మన్ గోలి సంధ్య వైస్ చైర్మన్ నరసింహారావు, ఉపాధాయయులు, సిబ్బంది అభినందించారు.

రెవెన్యూ సమస్యలపై బాధ్యతగా వ్యవహరించాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 13 : త్వరలో జరగనున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి ముందస్తుగా అధికారులు, సిబ్బందికి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి, తహసీల్దార్ పార్వతి తదితరులు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సంబంధించి సదస్సులలో నిర్వహించాల్సిన పనితీరుపై అవగాహన కల్పించారు. అధికారులు, సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వీఆర్వో, వీఎస్‌లు, వ్యవసాయ, దేవాదాయ, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

అధికారులకు జనసేన నాయకుల శుభాకాంక్షలు


ఎంపీడీవో స్వరూపరాణిని సన్మానిస్తున్న నాయకులు

చినగంజాం, ఆగస్టు 13 : మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్‌ఐలను జనసేన పార్టీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ జీ ప్రభాకరరావు, ఎంపీడీవో కే.స్వరూపరాణి, ఎస్ఐ ఎస్.రమేష్‌ను వారి కార్యాలయాలకు వెళ్లి వారిని శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్‌కుమార్, ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తుమ్మలపెంట సతీష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సందు శ్రీనివాసరావు, కుర్రి వాసుదేవరావు, నాయకులు తోట అశోకచక్రవర్తి, వోవా, గంటా వెంకటేష్ సీహెచ్ లక్ష్మణ్, బి.శ్రీనివాసరావు, ఎస్.సురేష్, బి.సాయి పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

అద్దంకి, ఆగస్టు 13 : జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబరు 14వ తేదీన జరుగుతుందని అద్దంకి సీనియర్ సివిల్ న్యాయాధికారి డి.నాగవెంకటలక్ష్మి తెలిపారు. రాజీ చేయదగిన క్రిమినల్ కేసులతో పాటు సివిల్, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాద కేసులు పరిష్కారం చేసుకోవాలని కోరారు.

సంతమాగులూరు ఎంపీడీవోగా లక్ష్మీదేవి

సంతమాగులూరు, ఆగస్టు 13 : సంతమాగులూరు ఎంపీడీవోగా జి.లక్ష్మీదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీవో కాశియ్య గుంటూరుకు బదిలీ అయ్యారు. లక్ష్మీదేవిని కార్యదర్శులు, సర్పంచ్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 13: పంటలు సాగు చేసిన రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం అద్దంకి మండలంలోని శింగరకొండపాలెంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ పంట నమోదు చేసుకున్న రైతులందరికీ బీమా, గిట్టుబాటు ధరలు, వడ్డీ రాయితీ, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. కౌలు రైతులందరు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని, వారు సాగు చేసిన పంటల పేర్లు నమోదు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు తూమాటి సాయిబాబు, రైతులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : పంటలు సాగు చేసిన రైతులు ప్రతి ఒక్కరూ ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవో కాశీవిశ్వనాథ్ తెలిపారు. మంగళవారం పాపాయిపాలెంలో పంటను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏల్చూరి రోడ్డులో చిన్నారి

సంతమాగులూరు, ఆగస్టు 13 : మండలంలోని అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై ఏల్చూరు వద్ద అమానుష ఘటన చోటుచేసుకుంది. ఏల్చూరు గ్రామం వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఏల్చూరు గ్రామంలో దర్గా బావి దగ్గర పసి బిడ్డను వదిలి వెళ్లింది. చుట్టుపక్కల వారు గమనించి అంగన్‌వాడీ కార్యకర్తలకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి 108లో అద్దంకికి తరలించారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ


బల్లికురవలో జైహింద్ అని రాస్తున్న అధికారులు, చినగంజాం, మార్టూరులో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బల్లికురవ, ఆగస్టు 13 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు మంగళవారం బల్లికురవలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులు, పలుశాఖల అధికారులు భారత్‌మాతాకీ జై అంటు, జైహింద్ అంటు నినాదాలు చేశారు. అనంతరం తెల్ల పేపర్‌పై జైహింద్ అంటూ సంతకాలను చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ దేశం కోసం తమ ప్రాణాలను అడ్డు పెట్టిన మహనీయుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. పంద్రాగస్టు వేడుకలను ఈ ఏడాది ఘనంగా జరపాలని అయన కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు వస్త్రం నాయక్, రమేష్, సర్వే డీటీ ప్రహర్ష, ప్రధానోపాధ్యాయుడు హనుమంతురావు, ఏఎస్‌వో అమరనాథ్, వీఆర్వోలు యార్లగడ్డ శ్రీనివాసరావు, వీరయ్య వెంకటేశ్వర్లు, మీనా, ఆశోక్ పాల్గొన్నారు.

చినగంజాం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ విద్యార్థులు పంద్రాగస్టు సందర్భంగా చినగంజాం గ్రామంలో తిరంగా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఆగస్టు 15వ తేదీన ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కను నాటాలని నినాదాలు చేస్తూ విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం డి.రత్నకుమారి, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు, కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ అధికారి ఎన్. సుబ్బారావు, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరు : మండలంలోని వలపర్ల గ్రామంలో గురువారం జెండా పండుగ సందర్భంగా మంగళవారం జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్‌లోని ఎన్‌సీసీ కెడెట్ అధికారి కేశినేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని హైస్కూల్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నిర్మలాదేవి ప్రారంభించారు. ప్రజలంతా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. హైస్కూల్ నుంచి పాత సినిమాహాలు వరకు ర్యాలీ సాగింది. ర్యాలీ ప్రారంభంలో పెద్ద జాతీయ జెండా ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పీఈటీ రవి దేవరాజ్‌తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


ట్యాంకుకు భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

మంచినీటి ట్యాంకుకు భూమి పూజ

మార్టూరు, ఆగస్టు 13 : మార్టూరులో పడమర బజారున 20వ బూత్ పరిధిలో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం భూమి పూజ చేశారు. గ్రామ పంచాయతీ నిధులతో 10 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన మంచినీటి ట్యాంకును నిర్మిస్తున్నారు. గతంలో 10 ఏళ్ల కిందట పంచాయతీ వారు మంచినీటి ట్యాంకును తాత్కాలికంగా నిర్మాణం చేశారు. దానికి కుళాయిలను కూడా ఏర్పాటు చేయడంతో ప్రజానీకం ఈ ట్యాంకు ద్వారా నీటిని వినియోగించుకున్నారు. అయితే అది శిథిలం కావడంతో ప్రస్తుతం ఆయా పరిసరాల ప్రజానీకం అవసరాలు కోసం ఆర్‌సీసీ మంచినీటి ట్యాంకును నిర్మించాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావు పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావుకు సూచనలు చేశారు. దాంతో ట్యాంకు నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకట్రావు, తగెడ్ల ఆంజనేయులు, కన్నెగంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్త

చీరాలటౌన్, ఆగస్టు 13 : చీరాల పురపాలక పరిధిలోని వీధి కుక్కల నుంచి ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుక్కల బెడదను తొలగించేందుకు అన్ని విధాలుగ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే తల్లిదండ్రులు పిల్లలను వాటికి దూరంగా ఉంచాలన్నారు. అలాగే వాటిపట్ల ఆకతాయాయంగా ఉండరాదన్నారు. సమస్యలు ఉన్నట్లయితే నేరుగా సమాచారం అందించాలన్నారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ అందజేత

అద్దంకిటౌన్, ఆగస్టు 13: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పేద మహిళకు కుట్టుమిషన్‌ను అందజేశారు. మంగళవారం రోటరీ మాజీ అధ్యక్షుడు అద్దంకి లేవి ప్రసాద్ ఆర్థిక సాయంతో అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన పేద మహిళ పూండ్ల కోటేశ్వరమ్మకు కుట్టు మిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, అళహరి హరిప్రసాద్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, దివాకర్‌దత్తు, పువ్వాడ కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, నర్రా శ్రీలక్ష్మి, కొల్లా భువనేశ్వరి, పసుపులేటి ఆంజనేయులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న చైల్డ్ ఫండ్ లింక్ వర్కర్స్

వ్యాధులపై అవగాహన

చినగంజాం, ఆగస్టు 13 : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైల్డ్ ఫండ్ లింక్ వర్కర్స్ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు, గ్రామస్థులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులు సంక్రమించడానికి గల కారణాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇంటెన్స్‌ఫైడ్ ఐఈసీ జిల్లా రిసోర్సుపర్సన్ జి.స్వరూప్ కుమార్ అన్నారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం అత్యంత ముఖ్యమన్నారు. అలాగే వ్యాధులు సోకిన వారు ప్రతిరోజూ తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రత్నకుమారి, సూపర్‌వైజర్ వినయ్, విజయశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 13 : అక్రమ రవాణా, అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఎస్సై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా పలు వాహనాల రికార్డులను పరిశీలించారు. నేర నియంత్రణకు ప్రజలు, వాహనదారులు సహకరించాలని సూచించారు. అలాగే స్ట్రయిట్‌కట్ వద్ద ప్రజలతో శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఉమ్మడి రిజర్వేషన్‌లను కాపాడుకుందాం

అద్దంకిటౌన్, ఆగస్టు 13: ఎస్సీల ఉమ్మడి రిజర్వేషన్‌లను కాపాడుకుని, రాజ్యాంగాన్ని రక్షించుకుందామని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అన్నారు. మంగళవారం అంబేడ్కర్ సామాజిక భవనంలో మాలమహానాడు అద్దంకి నియోజకవర్గ కమిటీ అత్యవసర సమావేశం అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని, పునర్ పరిశీలించి రాజ్యాంగాన్ని కాపాడాలన్నారు. 14న విజయవాడలో జరిగే వర్గీకరణ వ్యతిరేక సమావేశానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, శ్రీకృష్ణ, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగించుకోవాలి

బల్లికురవ, ఆగస్టు 13 : చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావడంద్వారా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడుతుందని ఈవోపీఆర్డీ సుమతి తెలిపారు. శానిటేషన్, చెత్త సంపద కేంద్రాలపై రెండో రోజు శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా నక్కబొక్కలపాడు చెత్త సంపద కేంద్రాన్ని సర్పంచ్‌లు, కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాలను వెంటనే వినియెగంలోకి తీసుకు రావాలని గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆమె సూచించారు.

పంగులూరు : గ్రామ పంచాయతీల పరిధిలో చెత్తను సేకరించి సంపదగా మార్చే విధానాలపై క్లాప్ మిత్రలు దృష్టి సారించాలని కార్యదర్శి సునీత సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవా రం జరిగిన సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో చెత్తను సంపదగా మార్చే విధానాలపై పలు సూచనలు చేశారు. డం పింగ్ యార్డ్‌ల నిర్వహణతో గ్రామాలలో పారిశుధ్యం కాపాడుకోవడంతోపాటు సంపదను సృష్టించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రమేష్‌బాబు కోరారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రామ్‌కుమార్, ఈవోఆర్డీ రాంబాబు, సర్పంచ్ నాగేంద్రం పాల్గొన్నారు.

మేదరమెట్ల : సర్పంచ్‌లు గ్రామంలోని అన్ని విభాగాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఏపీ ఎస్ఐఆర్డీ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం అన్నారు. రెండవ రోజు మంగళవారం మేదరమెట్లలో చెత్త సంపద కేంద్రాన్ని శిక్షణలో ఉన్న సర్పంచ్‌లతో కలిసి పరిశీలించారు. తడి, పొడి చెత్తను సేకరించడం, వాటిని ఎరువుగా మార్చడం వంటి విషయాలను వివరించారు. గ్రామాలల్లో పారిశుధ్య నిర్వహణ, పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లింపుపై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనింగ్ మేనేజర్ అమర్‌బాబు, ఇన్‌చార్జి ఈవోఆర్డీ కోటేశ్వరమ్మ, మేదరమెట్ల పంచాయతీ కార్యదర్శి జె.లక్ష్మీకాంత్, మేదరమెట్ల, కుర్రవానిపాలెం, రావినూతల, యర్రబాలెం తదితర గ్రామాల సర్పంచ్‌లు ఏలిశమ్మ, దశరదరామయ్య, విజయవీణ, నాగరాజు, విజయకుమార్ పాల్గొన్నారు.


పంగులూరులో మాట్లాడుతున్న కార్యదర్శి సునీత

ప్రతి పాఠశాలకు బిస్కెట్ ప్యాకెట్లు


బిస్కెట్లను అందజేస్తున్న దాత

పంగులూరు, ఆగస్టు 13 : స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా బిస్కెట్ ప్యాకెట్లు సరఫరా చేసినట్లు అజిత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ తెలిపారు. మండలంలోని 31 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలలతో పాటు అద్దంకి మం డలం చక్రాయపాలెం పాఠశాలకు సోమ, మంగళవారాలలో విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లను అందచేసినట్లు తెలిపారు. ఏటా ఆగస్టు 15, జనవరి 26న విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామాలపై నిఘా పెంచాలి



మాట్లాడుతున్న ఎస్ఐ చౌదరి

బల్లికురవ, ఆగస్టు 13 : గ్రామాలలో ఎలాంటి చిన్న పాటి ఘర్షణలు కూడా జరగకుండా గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో 19 గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న మహిళ పోలీసులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైన కొత్త వ్యక్తులు తిరిగితే వారి వివరాలను సేకరించాలన్నారు. అలానే చోరీలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలానే గ్రామాలకు కేటాయించిన డ్యూటీలను క్రమం తప్పకుండా చేయాలన్నారు. గతంలో నమోదై ఉన్న రౌడీషీటర్ల కదలికలను గమనించాలన్నారు. గ్రామాలలో ఉన్న దుకాణాల వివరాలను సేకరించాలన్నారు. అలానే క్వారీలు ఫ్యాక్టరీలలో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల కూలీలు వస్తే వారి వివరాలు కూడా సేకరించి ఉంచాలని, గ్రామాలలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఎస్ఐ కోరారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

చీరాల, ఆగస్టు 13 : ఎస్టీయూ సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. అందులో భాగంగా మంగళవారం పలు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు ప్రభాకరరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి కల్పించాలని ఇతర సమస్యలను ప్రస్తావిస్తూ, వాటిపై ప్రభుత్వం వెంటనే స్పందించేందుకు ఎస్టీయూ తన వంతు ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ చీరాల మండల బాధ్యులు ఏసురత్నం, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, పాండురంగారావు, వరదారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ప్రణీత్‌కుమార్

ఇంకొల్లు, ఆగస్టు 13 : ఆహార పదార్థాలలో కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఫుడ్‌సేఫ్టీ అధికారి పి.ప్రణీత్ కుమార్ హెచ్చరించారు. ఆహార భద్రతపై మంగళవారం వాసవీ పరమేశ్వరి కల్యాణ మండపంలో వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణీత్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందజేయాలన్నారు. లేనిపక్షంలో అపరాధ రుసుం విధిస్తామన్నారు. కల్తీ అహారం ద్వారా ఎవరికైనా ప్రాణహాని జరిగితే ఆ దుకాణదారుడికి రూ.10లక్షల జరిమానా విధిస్తారన్నారు. కార్యక్రమంలో ఫోస్టాక్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనిల్, కె.సురేంద్ర, సునీల్, వ్యాపారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పర్చూరు, ఆగస్టు 13: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందిచారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యద్దనపూడి మండలం పోలూరు గ్రామానికి చెందిన తానేటి శివరామకృష్ణ(39) తన ద్విచక్రవాహనంపై గత నెల 22న పర్చూరు నుంచి స్వగ్రామం పోలూరు వెళ్తుండగా పెదివారిపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు మలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ సురేష్ రెడ్డి తెలిపారు. అతనికి భార్య ఇద్దకు కుమారులు ఉన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గేర్ బాక్సులు దొంగలించిన వ్యక్తికి రిమాండ్

చినగంజాం, ఆగస్టు 13 : రొయ్యల చెరువుల్లో ఉపయోగించే ఏరియేటర్ గేర్ బాక్సులను దొంగిలించిన వ్యక్తికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఎస్.రమేష్ మంగళవారం తెలిపారు. చినగంజాం ప్రాంతంలోని చెరువుల వద్ద గేరుబాక్సులను దొంగిలిస్తున్నట్లు ఆక్వా రైతు రాజులపూడి సూర్యనారాయణస్వామి ఈ నెల 12వ తేదీన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మంగళవారం టీజంక్షన్ వద్ద వెళ్తున్న ఆటోని తనిఖీ చేయగా గేర్ బాక్సులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఒంగోలులోని నెహ్రూనగర్‌కు చెందిన కందిపాటి వెంకటేష్‌ని అరెస్ట్ చేసి, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాని విలువ రూ.28వేలు ఉంటుందని తెలిపారు. అరెస్ట్ చేసిన వ్యక్తిని చీరాల కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రానైట్ కార్మికుడు మృతి

బల్లికురవ, ఆగస్టు 13 : మండలంలోని వేమవరం గ్రామ సమీపంలో గ్రానైట్ ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తు పనులు చేస్తుండగా చైను తెగి బండరాయి పడి రాజస్థాన్‌కు చెందిన రాజు (20) కార్మికుడు మృతి చెందాడు. రోజు మాదిరిగానే ఫ్యాక్టరీలో పనులు చేస్తుండగా ఎక్స్‌కవేటర్ చైన్ తెగిపోవడంతో కటింగ్ కోసం ఉంచిన బండరాయి పడి రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఏఎస్ఐ బాలకృష్ణ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలను నమోదు చేశారు.